కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ : బుధవారం, 10 ఏప్రిల్ 2024
సంపుటి: 14, సంచిక: 06, పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

## ఆస్తుల వివరాలు తప్పనిసరి కాదు

**అభ్యర్థులు ఆస్తులను వెల్లడించడం వారి ఇష్టం: సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ ఏప్రిల్ 9 (నిఘా న్యూస్): ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు చరాస్తి వివరాలకు సంబంధించి సుప్రీంకోర్టు తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల బరిలో నిలిచే వ్యక్తి తన అభ్యర్థిత్వానికి సంబంధం లేని విషయాల్లో గోప్యతను పాటించే హక్కు ఉందని తెలిపింది. అభ్యర్థులు తమ ప్రతి చరాస్తి వివరాలు వెల్లడించాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఆ సమాచారం తెలుసుకోవడం ఓటర్లకు ఉన్న కచ్చితమైన -మిగతా 2వ పేజీలో

## మహారాష్ట్రలో కూటమి సీట్ల ఖరారు



02

## మేం అధికారంలో ఉన్నప్పుడు... అరెస్ట్ ఎందుకు చేయలేదు

**95 శాతం కేసులన్నీ ప్రతిపక్ష నేతల పైనే**

**నోరు మూసుకోండి లేదా ఈడీని పంపుతామని బెదిరిస్తున్న బిజెపి**

**కల్వకుంట్ల కవిత లేఖ**



న్యూఢిల్లీ ఏప్రిల్ 9 (నిఘా న్యూస్): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో మనీలాండరింగ్ అభియోగాలపై అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, తీహార్ జైలు నుంచి ఓ లేఖను విడుదల చేశారు. జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో కోర్టుకు వచ్చిన ఆమెను స్పందించాల్సిందిగా మీడియా కోరగా తాను చెప్పదల్చుకున్న విషయాల్ని ఓ లేఖ ద్వారా తెలియజేస్తానని ఆమె అన్నారు. ఆమె చెప్పినట్లుగానే కాసేపటికే కవిత పేరిట నాలుగు పేజీలతో ఓ లేఖ విడుదలైంది. 'నేను ఈ కేసులో బాధితురాలిని. నాకు ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేదు. దర్యాప్తు సంస్థలు చెబుతున్నట్టు -మిగతా 2వ పేజీలో





## కొనసాగనున్న... రేవంత్ దూకుడు

### కెసిఆర్‌కు వాహన ప్రమాద సూచిక

తెలుగు ఏడాది ఉగాది వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం పూట ఇళ్లలోనే ప్రత్యేక పూజలు, పచ్చడి ప్రసాదంతో బిజీ బిజీగా ఉండగా.. సాయంత్రం సమయంలో కొత్త పంచాంగ శ్రవణాలతో ఆలయాలు కిటకిటలాడాయి. అయితే.. ఈ కొత్త పంచాంగంలో రాజకీయ పార్టీల భవిష్యత్తు ఎలా ఉంది? నేతల భవితవ్యం ఎలా ఉంటుందనేది అందరిలో ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు, ప్రతిపక్ష నేత కేసీఆర్, కేటీఆర్ లాంటి నాయకుల భవితవ్యం ఎలా ఉందంటే..?

- గాంధీ భవన్, తెలంగాణ భవన్‌లో పండితుల ఉగాది పంచాంగ శ్రవణం
- ఉగాది వేడుకల్లో ఆయా పార్టీలకు అనుకూలంగానే పంచాంగ పఠనాలు
- మంత్రులకు ప్రాణ గండం.. ప్రతిపక్షం మరింత వీక్
- రాహుల్ గాంధీకి రాజయోగం: కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం
- అనారోగ్యంతో ఓ పత్రిక యజమాని సైతం మరణిస్తారు
- గాంధీభవన్‌లో జ్యోతిష్య పండితులు డా. చిలుకూరి శ్రీనివాసమూర్తి
- తెలంగాణ భవన్‌లో కెసిఆర్‌కు ఎదురు ఉండదన్న వేద పండితులు
- పాలకపక్షాలకు కష్టాలు కనిపిస్తున్నాయి
- ప్రతిపక్షం కష్టపడితే విజయం సొంతమవుతుంది



హైదరాబాద్ ఏప్రిల్ 9 (నిఘా న్యూస్) తెలుగు వారి కొత్తేడాది ఉగాది పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. శ్రీ క్రోధి నామ సంవత్సరానికి అంతే ఘనంగా స్వాగతం పలుకుతున్నారు. ఉదయంపూట ఇళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించిన షడ్రుచులతో పచ్చడి చేసుకుని ఆస్వాధించగా సాయంత్రం సమయంలో ఆలయాలకు వెళ్లి పంచాంగ శ్రవణం చేస్తుంటారు. కాగా ఈ పంచాంగ పఠనాలతో రాష్ట్ర వ్యాప్తంగా సందడి నెలకొంది. ఈ ఏడాది ఎవరి భవిష్యత్తు -మిగతా 2వ పేజీలో



## ఒక్క అంగుళమైనా... చైనా ఆక్రమించలేదు

**అస్సాంలోని లఖింపుర్‌లో నిర్వహించిన ప్రచార సభలో అమిత్ షా**



న్యూఢిల్లీ ఏప్రిల్ 9 (నిఘా న్యూస్) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలో భారత భూభాగం లో ఒక్క అంగుళాన్నీ చైనా ఆక్రమించలేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. 1962లో చైనాతో యుద్ధం సమయం లో అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌లకు అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 'బై-బై' చెప్పిన తీరును ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా అస్సాంలోని లఖింపుర్‌లో -మిగతా 2వ పేజీలో

## తెలంగాణకు చల్లని కబురు

**రాగల ఐదు రోజులో తేలికపాటి వర్షాలు**



హైదరాబాద్ ఏప్రిల్9 ( నిఘా న్యూస్): తెలంగాణలో రాగల ఐదు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మధ్య మహారాష్ట్ర వద్ద -మిగతా 2వ పేజీలో

## దేశం బలంగా ఉంటేనే.. ప్రపంచం మాట వింటుంది

**సమస్య ఏదైనా సరే పరిష్కరించే సత్తా భారత్‌కు ఉంది**

**ఉత్తరప్రదేశ్ పీలీభీత్‌లో భాజపా బహిరంగ సభలో మోడీ**



లక్నో ఏప్రిల్ 9 (నిఘా న్యూస్): ఎంతటి క్లిష్ట సమస్యనైనా పరిష్కరించగల శక్తి తనకుందంటూ భారత్ ప్రపంచానికి నిరూపిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో -మిగతా 2వ పేజీలో

## బిఆర్ఎస్ మీటింగ్‌లో పాల్గొన్న... 106 మంది ప్రభుత్వ ఉద్యోగులపై వేటు




సిద్దిపేట ఏప్రిల్ 9 (నిఘా న్యూస్): లోక్ సభ ఎన్నికల వేళ తెలంగాణలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఓ -మిగతా 2వ పేజీలో

## ఎన్నికల వేళ సీఈసీ భద్రతకు ముప్పు

**జెడ్ కేటగిరీ భద్రతను కేటాయించిన ప్రభుత్వం**



న్యూఢిల్లీ ఏప్రిల్ 9 (నిఘా న్యూస్): లోక్‌సభ ఎన్నికల వేళ కీలక పరిణామాలు చోటు చేసుకొన్నాయి. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు 'జెడ్' కేటగిరి కింద వీఐపీ భద్రత కల్పించింది. దీంతో సాయుధ కమాండో దళాలు ఆయనకు పూర్తి రక్షణ కల్పించ నున్నాయి. ఎన్నికల నేపథ్యంలో పొంచి ఉన్న ముప్పును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు ముప్పు పొంచి ఉన్న దృష్ట్యా ఆయనకు పూర్తి రక్షణ కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి భద్రతా ఏజెన్సీలు ఇటీవల -మిగతా 2వ పేజీలో



## నెల రోజుల్లో... నాలుగు ఎన్‌కౌంటర్లు

**ఆకుల్లా రాలిపోతున్న ఉద్యమకారులు**

**అనుమానిత ప్రాంతాలను జల్లెడ పడుతున్న పోలీసులు**

వరంగల్ ఏప్రిల్ 9 (నిఘా న్యూస్): నెలరోజుల వ్యవధిలో తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో నాలుగు ఎన్‌కౌంటర్లు జరిగాయి. మావోయిస్టుల ఏరివేతకు ఇదే మంచి కాలంగా భావిస్తున్నాయి బలగాలు. అనుమానిత ప్రాంతాలను జల్లెడ -మిగతా 2వ పేజీలో

## వాలంటీర్లకు 10 వేల వేతనం: చంద్రబాబు

**తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన ఉగాది వేడుకలు**



మంగళగిరి ఏప్రిల్ 9 (నిఘా న్యూస్): తెలుగు వారు గొప్పగా నిర్వహించుకునే పండగ ఉగాది అని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. కొత్త ఏడాదిలో రాష్ట్రం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో చంద్రబాబు పాల్గొన్నారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ వాలంటీర్లకు తీపికబురు చెప్పారు. తాము అధికారంలోకి రాగానే వారికి రూ.5 వేలు కాదు, 10 వేల గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారు. వాలంటీర్ల వ్యవస్థను -మిగతా 2వ పేజీలో

## మహారాష్ట్రలో కూటమి సీట్ల ఖరారు




**ముంబై ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** లోక్‌సభ ఎన్నికల వేళ ఎట్టకేలకు మహారాష్ట్రలో ప్రతిపక్షాల ఇండియా కూటమి సీట్ల పంపిణీ ఒప్పందం కుదిరింది. ఈ మేరకు మంగళవారం మహావికాస్‌ఆఘాడీ నేతలు సంయుక్తంగా ప్రకటించారు.

శివసేన(యూబీటీ) 21 సీట్లు, కాంగ్రెస్‌పార్టీ 17 సీట్లు, ఎన్సీపీ(శరద్ చంద్ర పవార్) 10 సీట్లతో లోక్‌సభ ఎన్నికల బరిలో దిగనున్నారు.

మొదటి నుంచి ఆశించిన సంగాలి లోక్‌సభ నియోజకవర్గాన్ని శివసేన(యూబీటీ) దక్కించుకోగా.. భీవండి స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ తీసుకుంది. మరోవైపు శివసేన(యూబీటీ)కి పట్టు ఉన్న ముంబై నార్త్ స్థానాన్ని సీట్ల పంపిణీలో భాగంగా కాంగ్రెస్ పార్టీ దక్కించుకోవటం గమనార్హం. సీట్ల పంపిణీ అనంతరం శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే మాట్లాడారు.

'ప్రతిఒక్కరు అన్ని సీట్లలో గెలవడానికి తీవ్రంతా పోరాడాలి. పోరాడటంలో ఎలాంటి తప్పు లేదు. ఖచ్చితంగా అన్ని సీట్లలో గెవడానే మొదటి ప్రాధాన్యత ఇవ్వండి' అని ఉద్ధవ్ అన్నారు. మొత్తం 48 లోక్‌సభ స్థానాలు ఉన్న మహారాష్ట్రలో ఏప్రిల్ 19 నుంచి ఐదు దశల్లో పోలింగ్ జరగనుంది. అయితే కొన్ని కీలకమైన సీట్ల విషయంలో మహా వికాస్ ఆఘాడీ కూటమి సీట్ల పంపకం కొంత జాప్యమైన విషయం తెలిసిందే.

## ఆస్తుల వివరాలు తప్పనిసరి కాదు



(మొదటిపేజీ తరువాయి)

హక్కేమీ కాదని వ్యాఖ్యానించింది. 'అభ్యర్థికి అత్యంత విలువైన ఆస్తులు ఉండి, విలాసవంతమైన జీవన శైలిని ప్రతిబింబిస్తే తప్ప తన కుటుంబ సభ్యుల చరాస్తి వివరాలు వెల్లడించాల్సిన అవసరం లేదు. అని స్పష్టం చేసింది. ఎన్నికల్లో పోటీ చేసే అతడు లేదా ఆమె తన అభ్యర్థిత్వానికి సంబంధం లేని విషయాల్లో గోప్యతను పాటించే హక్కు వారికి ఉందని తెలిపింది.

అరుణాచల్ ప్రదేశ్ లోని తేజు ప్రాంతం నుంచి కరిఖో అనే అభ్యర్థి 2019లో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. అయితే, ఆయన ఎన్నికపై ప్రత్యర్థి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కరిఖో తన నామినేషన్ లో భార్య, కుమారుడికి చెందిన మూడు వాహనాల వివరాలు వెల్లడించకుండా ప్రభావం చూపారని కోర్టుకు తెలిపారు. కాగా, కరిఖో ఎన్నికల్లో నామినేషన్ వేయడానికి ముందే ఆ వాహనాలు గిఫ్ట్ ఇవ్వడమో, విక్రయించడమో చేశారని గుర్తించిన న్యాయస్థానం వాటిని ఆ కుటుంబానికి చెందినవిగా పరిగణించలేమని పేర్కొంది. ఈ సందర్భంగా కరిఖో ఎన్నికను సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. పిటిషనర్ అభ్యంతరాలను తోసిపుచ్చింది. అలాగే, ఆయన ఎన్నిక చెల్లదంటూ గువాహటి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం పక్కన పెట్టింది.

### ఒక్క అంగుళమైనా...
## చైనా ఆక్రమించలేదు



(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించిన ప్రచార సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బంగ్లాదేశ్‌తో దేశ సరిహద్దును కట్టుదిట్టం చేసిన తమ ప్రభుత్వం చొరబాట్లను అరికట్టిందని చెప్పారు.

"1962లో చైనా దురాక్రమణ వేళ అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్‌లను నెహ్రూ పట్టించుకోలేదు. ఇప్పుడు మన భూమిలో ఒక్క అంగుళాన్ని ఆ దేశం ఆక్రమించలేకపోయింది. డోక్లామ్‌లో కూడా వారిని తరిమికొట్టాం. గతంలో కాంగ్రెస్ పాలకులు అస్సాంకు అన్యాయం చేశారు. వివిధ హింసాత్మక ఆందోళనలు, తిరుగుబాటు సంబంధిత ఘటనల్లో అనేకమంది మృతి చెందారు. కానీ గత పదేళ్లలో శాంతి ఒప్పందాలు కుదిరాయి. తొమ్మిది వేలమంది ఆందోళనకారులు లొంగిపోయారు. రాష్ట్రంలోని 80 శాతం ప్రాంతాల నుంచి సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని ఉపసంహరించుకున్నాం అని షా తెలిపారు. దేశ సర్వతోముఖాభివృద్ధికి ఈశాన్య రాష్ట్రాలే కీలకమని పేర్కొన్న ఆయన ఇక్కడి అన్ని స్థానాల్లో ఎన్డీయే అభ్యర్థులకు విజయాన్ని కట్టబెట్టాలని కోరారు.

## తెలంగాణకు చల్లని కబురు



(మొదటిపేజీ తరువాయి)

కేంద్రీకృతమైన ఆవర్తనం అంతర్గత కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో కొనసాగుతోందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది.

మంగళవారం తెలంగాణలో కిందిస్థాయి గాలులు దక్షిణ, ఆగ్నేయ దిశల నుంచి వీస్తున్నట్టు తెలిపింది. గత రెండ్రోజులుగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. 44.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు మొన్నటి వరకు నమోదు కాగా.. ఇవాళ 40 డిగ్రీల ఉష్ణోగ్రతే అధికంగా నమోదైంది. మరో ఐదు రోజుల పాటు ఉష్ణోగ్రతల ప్రభావం తక్కువగా ఉంటుందని వాతావరణశాఖ తెలిపింది.

## ఎన్నికల వేళ సీఈసీ భద్రతకు ముప్పు

(మొదటిపేజీ తరువాయి)



సిఫార్సు చేశాయి. దీనిని పరిశీలించిన హోంశాఖ తాజా నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌కు చెందిన 40 నుంచి 45 మంది సిబ్బంది సీఈసీ రక్షణ విధుల్లో ఉండనున్నారు.

1984 బ్యాచ్‌కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ రాజీవ్ కుమార్.. 2020లో ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు. మే 15, 2022న 25వ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం 18వ లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో నిమగ్నమయ్యారు.

# కొనసాగనున్న... రేవంత్ దూకుడు

(మొదటిపేజీ తరువాయి)




ఎలా ఉందన్నది అందరూ ఆసక్తికరంగా తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీల నేతలు కూడా తమ భవితవ్యం ఎలా ఉంటుందన్నది ప్రచాంగ కర్తలతో తెలుసుకున్నారు. అయితే, ఎన్నికల ఏడాది కావడంతో ప్రధాన పార్టీల కార్యాలయాల్లో పంచాంగ శ్రవణం ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉంటే పార్టీ కార్యాలయాల్లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆయా పార్టీలకు అనుకూలంగానే పంచాంగ పఠనాలు జరగటం గమనార్హం. ఈ క్రమంలోనే గాంధీభవన్‌లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో చిలుకూరి శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ ఏడాది సీఎం రేవంత్ రెడ్డి పనితీరు పరశురాముడిలా ఉంటుందని పంచాంగ కర్త చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ జరిగిందని ఇది శుభపరిణామమని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి గత అక్టోబర్ నుంచి సింహంలా పనిచేశారని, క్రోధి నామ సంవత్సరంలో కూడా అదే దూకుడు ప్రదర్శిస్తారని చెప్పుకొచ్చారు. ఇదిలా ఉంటే రాష్ట్రంల్లో ప్రతిపక్షం మరింత వీక్ అయ్యే అవకాశం ఉందని వివరించారు.

**రాహుల్ గాంధీకి రాజయోగం**

మరోవైపు, కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం రాబోతున్నదని పంచాంగ కర్త పేర్కొన్నారు. రాహుల్ గాంధీకి కూడా రాజయోగం ఉందని ప్రధానమంత్రి పదవిలో మార్పులు సంభవిస్తాయని సెలవిచ్చారు. ఈ ఏడాది మంత్రులకు ప్రాణగండం ఉందని పంచాంగకర్త తెలిపారు. పలువురు మంత్రులు మరణాలతో పాటు ఈ ఏడాది ఓ పత్రిక యజమాని కూడా అనారోగ్యంతో చనిపోయే సూచనలు ఉన్నాయని వివరించారు. రాజకీయనేతలు కూడా శిక్షార్హులు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని తెలిపారు.

**కేసీఆర్‌కు ప్రమాద సూచన**

మరోవైపు తెలంగాణ భవన్‌లో కూడా పంచాంగ పఠనం జరగ్గా పండితులు బీఆర్ఎస్ పార్టీ నేతలకు పలు సూచనలు చేశారు. రాబోయే ఎన్నికల్లో పాలకపక్షాలకు కష్టాలు కనిపిస్తున్నాయని ప్రతిపక్షంగా ఉన్నవారు కష్టపడితే విజయం సొంతమవుతుందని వివరించారు. కేసీఆర్‌ది కర్కాట రాశి కాగా ఆదాయ, వ్యయాలు సంతృప్తికరంగానే ఉన్నాయని తెలిపారు. వారి మాటకు, గమనానికి అడ్డు ఉండదని కానీ.. ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాహన ప్రమాద సూచన ఉంది కాబట్టి ఎక్కువ ప్రయాణాలు చేయొద్దన్నారు.

# నెల రోజుల్లో... నాలుగు ఎన్‌కౌంటర్లు

(మొదటిపేజీ తరువాయి)



పడుతున్నాయి. అసలే వేసవి కాలం, మరోవైపు లోక్‌సభ ఎన్నికలు. మరోవైపు అడవిని జల్లెడ పట్టేస్తున్న భద్రతా బలగాలు.. మొత్తానికి మావోయిస్టులకు పెద్ద చిక్కే వచ్చి పడింది. అందుకే నెల రోజులుగా అడవిలో తుపాకుల మోత పెరుగూ వస్తోంది. ఇది మావోయిస్టులకు కోలుకొని దెబ్బ తీస్తోంది. వరుస ఎన్‌కౌంటర్లతో దళాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి.

**ఉక్కిరిబిక్కిరి**

నెలరోజుల వ్యవధిలో తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లోని మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్‌లో నాలుగు ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఎండాకాలం వచ్చిందంటే చాలు మావోయిస్టులకు గడ్డుకాలం మొదలైనట్టే. ఆకు రాలే కాలాన్ని అనుకూలంగా మార్చుకునే భద్రతా సిబ్బంది వేట మొదలు పెడుతుంటారు. అందులో ఎన్నికల సీజన్ కూడా కలిసి వచ్చింది. అందుకే వరుస ఎన్కౌంటర్లతో పచ్చని అడవి నెత్తుటి రంగును పూసుకుంటోంది.

**లేటెస్ట్ టెక్నాలజీతో నిఘా**

మావోయిస్టులను అంతమొందించడానికి భద్రతా బలగాలు వేసవిని ఉపయోగించు కుంటున్నాయి. దీనికి తోడు ఆధునిక టెక్నాలజీ కూడా వారికి మరింత సాయం చేస్తోంది. గూగుల్ మ్యాప్, శాటిలైట్, డ్రోన్ల వ్యవస్థతో గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న మావోయిస్టులపై ఉక్కు పాదం మోపుతున్నారు. అందుకే ఆకు రాలుతున్నట్టు మావోయిస్టులు నెలరాలుతున్నారు.

**కలిసిరాని వేసవి**

వేసవికాలం మావోయిస్టులకు కలిసి రాని కాలం. మావోయిస్టులకు పచ్చని అడవులు షెల్టర్ జోన్లు. అడవి ఎంత పచ్చగా ఉంటే మావోలు అడవుల్లో అంత బలంగా ఉంటారు. వేసవి కాలంలో పచ్చని అడవి ఆకురాల్చి ఎడారిగా మారుతుంది. దీంతో మావోలకు సురక్షితమైన షెల్టర్ జోన్లు లేకుండా పోతాయి. మావోలు ఎక్కువగా నీటి మీద ఆధారపడి ఉంటారు. వేసవికాలం కావడంతో అడవుల్లో నేటికుంటలు, చెలిమలు ఎండిపోతాయి. దీంతో మావోయిస్టులు నీటి గోదావరి పరివాహక ప్రాంత వాగుల వెంట రాకతప్పదు. అంతేకాకుండా సేఫ్ జోన్‌లకు వెళ్ళడానికి రాష్ట్రాల సరిహద్దులు దాటాల్సి వస్తుంది.

**మంచి తరుణం అంటున్న బలగాలు**

మావోయిస్టుల ఏరివేతకు ఎండాకాలం అనువైనది భావిస్తున్న కేంద్ర, రాష్ట్ర బలగాలు మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో జల్లెడతున్నారు. కూంబింగ్‌తోపాటు శాటిలైట్, మూడు రాష్ట్రాల్లోని గోదావరి వెంట గూగుల్ మ్యాప్‌లతో మావోయిస్టుల ఏరివేత జరుగుతుంది. అన్నీ కలిసి వచ్చి పైచేయి సాధిస్తున్నాయి పోలీస్ బలగాలు. అందుకు నెల రోజుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లే నిదర్శనంగా చెప్పవచ్చు.

**కాల్పుల మోత**

మార్చి 19న మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. తెలంగాణ నుంచి మహారాష్ట్ర బీజాపూర్‌లోనీ ప్రాణహిత నది దాటి సమయంలో పోలీస్‌లకు మావోలకు ఎదురుకాల్పులు జరిగాయని పోలీసులు తెలిపారు.

మార్చి 27న చత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగి ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీజాపూర్ సుక్మా సరిహద్దు ప్రాంతంలోని చీపుర్‌భట్టి ప్రాంతంలో ఎదురు కాల్పులు జరిగి ఒక డిప్యూటీ కమాండర్ సహా ఆరుగురు మావోలు మృతి చెందారు.

ఏప్రిల్ 2న ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా కోర్చోలి అడవుల్లో తెల్లవారు జామున జరిగిన ఎదురు కాల్పుల్లో 13 మంది మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టుల ఏరివేతలో భాగంగా కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న క్రమంలో కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో పోలీస్‌లు ఆధునిక ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు.

గత వారం కూడా అడవుల్లో తుపాకీ మోతలు మోగాయి. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ములుగు జిల్లా కర్రిగుట్టలు, ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ పరిధిలో ఉన్న అటవీ ప్రాంతంలో పోలీసులు కూంబింగ్ చేస్తున్న క్రమంలో భద్రతా బలగాలకు మావోయిస్టులకు కాల్పులు జరిగాయి. ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలంలో ఏకే-47తోపాటు మూడు తుపాకులు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ వెల్లడించారు.

నెలరోజుల వ్యవధిలోపే జరిగిన 4 ఎన్‌కౌంటర్లలో 26మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్‌కౌంటర్లు నీటి పరివాహక ప్రాంతాలతోపాటు ఉదయం సమయాల్లో జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఎన్కౌంటర్లలో చనిపోయిన వారిలో యువతే ఎక్కువగా ఉన్నారు. ఎండాకాలం మావోయిస్టులను కోలుకోలేని దెబ్బతీస్తుందని చెప్పవచ్చు.

## దేశం బలంగా ఉంటేనే.. ప్రపంచం మాట వింటుంది



(మొదటిపేజీ తరువాయి)

ఉత్తరప్రదేశ్‌లోని పీలీభీత్‌లో భాజపా మంగళవారం నిర్వహించిన బహిరంగ సభలో మోదీ పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రసంగించిన ఆయన భారత్ గొప్పతనాన్ని మరోసారి చాటి చెప్పారు. 'ప్రస్తుతం ప్రపంచమంతా అనేక కష్టాలను ఎదుర్కొంటోంది. సమస్య ఎంత క్లిష్టమైనా సరే భారత్ తలచుకుంటే ఖచ్చితంగా పరిష్కరించగలదు. ప్రతీఒక్కరి ఓటు బలంతోనే అది సాధ్యమవుతుంది. భారత్ స్ఫూర్తి, శక్తితో అభివృద్ధి చెందిన దేశంగా అవతరించేందుకు మనమంతా కృషి చేస్తున్నాం. అనుకుంటే సాధించలేనిదంటూ ఏదీ లేదని భారత్ ప్రపంచానికి నిరూపిస్తోంది. దేశం బలంగా ఉన్నప్పుడే ప్రపంచం దాని మాట వింటుంది అని మోదీ పేర్కొన్నారు.

కాంగ్రెస్ హయాంలో ఆ పార్టీ ప్రపంచ దేశాల నుంచి ఎన్నోసార్లు సాయం కోరిందని విమర్శించారు. కొవిడ్ మహమ్మారి సమయంలో ప్రపంచానికే ఔషధ సాయం చేసే స్థాయికి భారత్ ఎదిగిందని సగర్వంగా చాటి చెప్పారు. మన దేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక శక్తిగా అవతరించినప్పుడు మీరు గర్వించారా లేదా చంద్రయాన్ ద్వారా చంద్రునిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసినప్పుడు గర్వించారా లేదా జీ20 శిఖరాగ్ర సదస్సుకు సమర్థవంతంగా బాధ్యత వహించిన భారత్ తీరుపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తాయి" అని వ్యాఖ్యానించారు.

**యూపీ మాజీ సీఎంపై మోదీ ప్రశంసలు**

భాజపా సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి కల్యాణ్‌సింగ్‌పై ప్రధాని ప్రశంసలు కురిపించారు. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో సీఎంగా ఉన్న ఆయన రామమందిర నిర్మాణం కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. దేశంలోని ప్రతీ కుటుంబం అయోధ్య మందిరాన్ని నిర్మించేందుకు సహకరించిందని కానీ, ఇండియా కూటమి మాత్రం వ్యతిరేకిస్తూనే ఉందని విమర్శించారు.

## బిఆర్ఎస్ మీటింగ్‌లో పాల్గొన్న... 106 మంది ప్రభుత్వ ఉద్యోగులపై వేటు




(మొదటిపేజీ తరువాయి)

మీటింగులో పాల్గొన్న 106 మంది ప్రభుత్వ ఉద్యోగులపై ఒకేసారి వేటు పడింది. ప్రస్తుతం లోక్ సభ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సంగతి తెలిసిందే. అయితే,వీళ్లంతా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్నందుకు గానూ 106 మందిని సస్పెండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశాలు జారీ చేశారు.

ఈనెల 7న సిద్దిపేటలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో ఉపాధి హామీ, సెర్ప్ ఉద్యోగులతో మెదక్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, సుడా మాజీ ఛైర్మన్ రవీందర్ రెడ్డి, మరికొందరు నాయకులు రహస్యంగా సమావేశం నిర్వహించారు. ఈ విషయం కాస్తా బయటకు తెలియటంతో వెంకట్రామి రెడ్డి, రవీందర్ రెడ్డిపై కేసు నమోదైంది. ఈ క్రమంలోనే సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించారు. సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా మీటింగ్‌లో పాల్గొన్న ఉద్యోగులను గుర్తించి, వారిపై సస్పెన్షన్ వేటు వేశారు. సస్పెండైన వారిలో 38 మంది సెర్ప్ ఉద్యోగులు, 68 మంది ఉపాధి హామీ ఉద్యోగులు ఉన్నారు.

# మేం అధికారంలో ఉన్నప్పుడు... అరెస్ట్ ఎందుకు చేయలేదు

(మొదటిపేజీ తరువాయి)



ఆర్థికంగా ఎలాంటి లబ్ది నాకు చేకూరలేదు. సిబిఐ, ఈడి దర్యాప్తు కంటే మీడియా విచారణ రెండున్నర ఏళ్లుగా జరిగింది. రాజకీయంగా, వ్యక్తిగతంగా నా ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించారు.

నా మొబైల్ నెంబర్‌ను టీవీ ఛానల్స్‌లో ప్రసారం చేసి నా ప్రైవసీని దెబ్బతీశారు. నాలుగు పర్యాయాలు విచారణకు హాజరయ్యాను. బ్యాంకు వివరాలు సైతం ఇచ్చి విచారణకు అన్ని విధాలా సహకరించాను. దర్యాప్తు సంస్థకు నా మొబైల్ ఫోన్లు అన్నీ అందజేశాను. కానీ వాటిని ధ్వంసం చేసినట్టు నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. గత రెండున్నరేళ్లుగా కేసులో భాగంగా అనేక సోదాలు జరిపారు.

భౌతికంగా మానసికంగా వేధింపులకు గురిచేశారు. చాలామందిని అరెస్ట్ చేశారు. వాంగ్మూలాలు తరచూ మార్చుతూ వచ్చిన వారిని ఆధారంగా చేసుకుని కేసును నడిపిస్తున్నారు. సాక్షులను బెదిరిస్తున్నట్టు నాపై ఆరోపణలు చేస్తున్న ఈడీ, మా పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు అరెస్టు చేయలేదు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా నన్ను ఇప్పుడు అరెస్టు చేశారు. రెండున్నర ఏళ్ల విఫల దర్యాప్తు అనంతరం ఈడి నన్ను అరెస్ట్ చేసింది. సుప్రీంకోర్టులో కఠిన చర్యలు తీసుకోబోము అని చెప్పి నన్ను అరెస్ట్ చేసింది. 95 శాతం కేసులు అన్నీ ప్రతిపక్ష పార్టీల నేతలకు సంబంధించినవే. బీజేపీలోకి చేరిన వెంటనే ఆ కేసుల విచారణ ఆగిపోతుంది. పార్లమెంటు సాక్షిగా బిజెపి నేతలు విపక్ష నేతలను ఉద్దేశించి 'నోరు మూసుకోండి లేదా ఈడీని పంపుతాం'అన్నారు.

..ఇలాంటి దారుణ పరిస్థితుల్లో విపక్ష పార్టీలన్నీ న్యాయవ్యవస్థ వైపు చూస్తున్నాయి. న్యాయవ్యవస్థ ఉపశమనం కల్పిస్తుందని ఆశతో ఉన్నాము. కేసు దర్యాప్తునకు సహకరించేందుకు నేను పూర్తి సిద్ధంగా ఉన్నాను. ఈ పరిస్థితుల్లో నాకు బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థిస్తున్నాను. నా చిన్న కుమారుడు పరీక్షలకు సిద్ధపడుతున్న సమయంలో తల్లిగా నేను తనతో ఉండాలి. నా పాత్రను ఎవరు భర్తీ చేయలేరు. నేను లేకపోవడంతో నా కుమారుడిపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నాను. నా బెయిల్ అభ్యర్థనను పరిశీలించాల్సిందిగా మళ్లీ కోరుతున్నాను అని లేఖలో పేర్కొన్నారామె.

అలాగే.. ఇది తప్పుడు కేసు. నేను చెప్పాల్సింది కోర్టులో చెప్పాను. మిగతాది లేఖ ద్వారా తెలియజేస్తా అని కోర్టు ప్రాంగణంలో కవిత మీడియాకు చెప్పారు.

# వాలంటీర్లకు 10 వేల వేతనం: చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగిస్తామని తాము ముందే చెప్పామని వెల్లడించారు. ప్రజలకు సేవచేస్తే తాము అండగా ఉంటామని వాలంటీర్లకు తెలిపామని వివరించారు.

"మన దశ, దిశ నిర్దేశించుకునే వేడుక.. కొత్త ఉత్సాహం అందించే పండగ ఇది. ఉగాది సందర్భంగా కొత్త లక్ష్యాలు నిర్దేశించుకోవాలి. ఈ ఏడాదిలో సాధికారత రావాలి. నూతన సంవత్సరంలో ధరలు తగ్గాలి.. సంక్షేమం ఉండాలి. ఉగాది పచ్చడిలో తీపి, వగరు, చేదు.. అన్నీ ఉంటాయి. ఈ ఐదేళ్లలో బకాసురుడిని మించిన పాలన సాగింది. రాష్ట్రంలో కారం, చేదు రుచులే ఉన్నాయి. అశాంతి, అభద్రతాభావం కనిపిస్తున్నాయి. సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలను ఆదుకున్న పార్టీ తెలుగుదేశం. నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకూ నీళ్లు ఇవ్వొచ్చు. సహజ వనరులన్నీ వైకాపా దోపిడీ చేసింది. తెలుగు జాతికి మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలని మనమంతా సంకల్పం తీసుకోవాలి. ప్రజలు గెలవాలి



రాష్ట్రం నిలబడాలి ఇదే మన సంకల్పం" అని చంద్రబాబు అన్నారు.

**పంచాంగకర్త మాచిరాజు**

ఈ సందర్భంగా పంచాంగకర్త మాచిరాజు వేణుగోపాల్ నేతృత్వంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. రాష్ట్రంలో త్రిమూర్తుల కలయికతో ఏపీకి మేలు జరుగుతుందని తెలిపారు. 128 అసెంబ్లీ, 24 లోక్‌సభ స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని చెప్పారు. చంద్రబాబుకు అధికార యోగం ఉందని వివరించారు. ఆయనే రాజధాని అమరావతి నిర్మాణం చేపడతారని వెల్లడించారు.



పెదపూడి గ్రామంలోని శ్రీ కోదండ రామాలయం మరమ్మత్తుల నిమిత్తం శ్రీపతి ఫౌండేషన్ 25 వేల 116 రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాటూరి శ్రీకాంత్ మెరుగు సురేష్ పాల్గొన్నారు.

*-కూచిపూడి, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):*

## బీజేపీలో చేరిన గాంధారి మాజీ జెడ్పిటిసి



**కామారెడ్డి/గాంధారి, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని బిఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. గాందారి మాజీ జెడ్పిటిసి తానాజీ రావు బిజెపి రాష్ట్ర కార్యాలయం హైదరాబాదు లో జహీరాబాద్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి బిబి పాటిల్ సమక్షంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గాంధారి మాజీ జెడ్పిటిసి తానాజీ రావు బిజెపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ ప్రజల ప్రయోజనాల కోసం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఈ దేశ ప్రజల సంక్షేమం కోసం నరేంద్ర మోడీ తీసుకువస్తున్న పథకాలను దేశ ప్రజలు స్వాగతిస్తున్నారని వారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గాంధారి మండల బీజేపీ మాజీ అధ్యక్షులు సిహెచ్ సాయిబాబ ఎస్టి మోర్చ జిల్లా అధ్యక్షులు కట్రోత్ రవి బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు జువ్వాడి శ్రీకాంత్ మండల ఉపాధ్యక్షులు హుస్సేన్ బీజేపీ యువ నాయకుడు సిహెచ్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## కేసిఆర్ ను కలిసిన మేడ్చల్ నేతలు



**మేడ్చల్, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ ని మంగళవారం మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, మేడ్చల్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కలిశారు. ఎర్రవల్లి లోని ఫాంహౌస్ లో కేసిఆర్ ను కలిసిన నాయకులు శాలువాతో సత్కరించి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులకు కేసిఆర్ సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు రఘుపతి రెడ్డి ప్రధాన కార్యదర్శి సుదర్శన్ యూత్ అధ్యక్షులు హరత్ రెడ్డి రావల్ కొల్ మాజీ సర్పంచ్ మహేందర్, ఏఎంసీ మాజి డైరెక్టర్ రాజిరెడ్డి నాయకులు మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ దేవాలయంలో పూజలు



**బాగ్ లింగంపల్లి, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** ఉగాది పర్వదినం సందర్భంగా బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వెనుక కాలనీలో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో కార్పొరేటర్ రవి చారి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డివిజన్ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పూజాది కార్యక్రమంలో న్యాయవాది సంధ్యారాణి, దేవాలయ కమిటీ అధ్యక్షుడు శ్రీహరి, పుట్ట అశ్విని కుమార్ ముదిరాజ్,నిరంజన్ రెడ్డి,గోపాల్ సింగ్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది పంచాంగం... మంత్రి అమర్ నాథ్ గెలుపు ఖాయం



**గాజువాక, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** ఈ ఎన్నికల్లో గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గుడివాడ అమర్నాథ్ గెలుపు ఖాయమని పండితులు ఎన్.కామేశ్వర శర్మ చెప్పారు. శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గాజువాక నియోజకవర్గం కేంద్ర ఎన్నికల కార్యాలయంలో మంగళవారం పంచాంగ శ్రవణ కార్యక్రమం జరిగింది. పండితులు కామేశ్వర శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ ఎన్నికల్లో అమర్నాథ్ విజయం సాధించడం ఖాయమని, కార్యకర్తలు, నాయకులు ఆయనకు అండగా పని చేయాల్సి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట రామయ్య, ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావు, మొల్లి చిన్న యాదవ్, ఇంటెక్ నాయకుడు మంత్రి రాజశేఖర్, 65వ వార్డు అధ్యక్షులు లోకనాథరావు, 76వ వార్డు నాయకులు సన్నీ, పార్టీ సీనియర్ నాయకులు రొంగలి జగన్నాథం, ఈటి శ్యామలరావు, మద్ది శంకర్ రెడ్డి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను.. ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చండి

### మంత్రి బోత్సకు జర్నలిస్టు సంఘాల వినతి



**విశాఖపట్నం, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వైసీ పీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి భరోసా కల్పించాలని జర్నలిస్టు సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు నగరంలోని బీచ్ రోడ్ లో గల వైసిపి లోక్ సభ అభ్యర్థి ఎన్నికల కార్యాలయంలో సోమవారం మంత్రి బొత్స సత్యనారాయణను కలసి వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టుల సమస్యలను ఆయనతో చర్చించారు. సుదీర్ఘకాలంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పెండింగ్ లో ఉందని నాలుగు నెలల కిందట జీవో నెం.535ను విడుదల చేసి కూడా ప్రక్రియను పూర్తి చేయలేదని వారి దృష్టికి తెచ్చారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగానే జర్నలిస్టులకు నెలకు రూ.10వేలు చొప్పున పెన్షన్లు, కోవిడ్ తో చనిపోయిన జర్నలిస్టులకు జీవో ప్రకారం ఐదు లక్షల పరిహారం, జర్నలిస్టులపై దాడుల నివారణకు హైపర్ కమిటీలు, మీడియా కమిషన్ ఏర్పాటు, వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ కార్డులు ఉచితంగా జారీ, ప్రమాద బీమా సౌకర్యం సమస్యల పరిష్కారానికి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి భరోసా ఇవ్వాలని కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ఇస్తామని, కరోనాతో చనిపోయిన వారికి పరిహారం, జర్నలిస్టులపై దాడుల నివారణకు కమిటీలు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మేనిఫెస్టో చిన్నది కాబట్టి దాంట్లో జర్నలిస్టుల సమస్యలను చేర్చలేమని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్(ఎల్ ఎంఏ) అధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రమోహన్, జాప్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.ఎం. కీర్తనరావు, డబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు దొండా రమేష్, ఏపీజేయు జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ ఎం.శ్రీనివాసరావు ఎల్ఎన్ఏ ప్రతినిధులు పట్టేపు నాగేశ్వరరావు, భగవాన్, సురేష్ తదితరులు ఉన్నారు.

# టిడిపిలో చేరిన సీతంరాజు సుధాకర్



**విశాఖపట్నం, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** విశాఖ దక్షిణలో వైసీపీ కి భారీ షాక్. అందరూ ఊహించి నట్టుగానే సీనియర్ నేత సీతంరాజు సుధాకర్ తో పాటు ఇద్దరు కార్పొరేటర్లు, వివిధ అనుబంధ సంఘాల నేతలు, వర్తక సంఘం ప్రతినిధులు, ఆలయ ధర్మకర్తలు, కార్యకర్తలు టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరినీ అభినందిస్తూ చంద్రబాబు పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ కి దెబ్బ కొట్టేలా కూటమి అభ్యర్థి వంశీ కృష్ణ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా చంద్రబాబు విశాఖ నేతలకు హితవు పలికారు. అధికార పార్టీ అరాచకాల్ని అడ్డు వేసేందుకు ప్రజలు వైసిపికి ఓటు తోనే బుద్ధి చెప్పాలని సూచించారు. ఈ ఉగాది రాష్ట్ర ప్రజల్లో వెలుగులు నింపాలంటే టీడీపీ కూటమి గెలుపు అనివార్యమన్నారు. చంద్రబాబుతో కండువా కప్పించుకున్న వారిలో 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, 35వ వార్డు కార్పొరేటర్ విళ్లూరి భాస్కరరావు, యాత కార్పొరేషన్ డైరెక్టర్ బీవీఎస్ నవీన్ కుమార్, విశాఖ సౌత్ మైనారిటీ విభాగ అధ్యక్షులు ఎస్కే సలీం, స్టేట్ యూత్ సెక్రటరీ కె. సతీష్ కుమార్, 35వ వార్డు వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.గౌరీ శంకర రావు, దుర్గాలమ్మ దేవస్థానం ధర్మకర్తలు బి.మంగరాజు, కంటిపిల్లి వరలక్ష్మి, సీహెచ్ మణెమ్మ, వర్తక సంఘం ప్రతినిధి సీహెచ్ రామిరెడ్డి, సీనియర్ నేతలు నిమ్మ శ్రీనివాస రెడ్డి, గజ్జి సురేష్, కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి ప్రతినిధి ఎస్ అరుణ్ కుమార్ తదితరులున్నారు.

# తెలుగు పండుగలపై ఐటీ ప్రభావం

- శ్రీ క్రోధి నామ సంవత్సరంలో అన్నీ విజయాలే
- జిల్లా కలెక్టర్ డా.మల్లిఖార్జున
- చిల్డ్రన్ ఎరీనాలో వైభవంగా ఉగాది వేడుకలు



**విశాఖపట్నం, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** స్థానిక ఉడా చిల్డ్రన్ ఎరీనాలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు శాస్త్రోక్త పూజలు, వేదపారాయణ మంత్రోచ్చరణల నడుమ అత్యంత వైభవంగా జరిగాయి. పంచాగ పఠన వేదిక వద్ద ఉత్సమూర్తులు ఆశీనులవ్వగా ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్ ఇతర ప్రముఖులు హాజరయ్యారు. అనంతరం అతిథులందరూ పంచాగంలో పేర్కొన్న విశేష అంశాలను ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వేదపండితులు వేదపారాయణం చేయగా పంచాంగ కర్త రొంపిచర్ల సింగరాచార్యులు పంచాగ శ్రవణం చదివి వినిపించారు. షడ్రుచుల సమ్మేళనం మాదిరి, ఈ ఏడాది మంచి చెడులు కలగలసి ప్రజల జీవనం ఆశించిన విధంగానే ఉంటుందని పంచాంగ కర్త సింగరాచార్యులు పంచాంగ శ్రవణంలో పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా ముందుగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు మూలాలను మర్చిపోకుండా వేడుకలను నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున పేర్కొన్నారు. ఉగాది వేడుకల్లో భాగంగా సందేశాన్ని అందించిన ఆయన ఐటీ విప్లవం వల్ల తెలుగు పండుగలపై కాస్త ప్రభావం పడిందని విచారం వ్యక్తం చేశారు. న్యూ ఇయర్ లాంటి వేడుకలు కూడా చేసుకోవచ్చని అయితే తెలుగు సాంప్రదాయ మూలాలను మాత్రం మర్చిపోకూడదని ఈ సందర్భంగా హితవు పలికారు. ఇలాంటి వేడుకలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజలందరూ ముందుకొచ్చి తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. 75 నుంచి 80 శాతం ఓటింగ్ నమోదయ్యేలా అధికారులు, ప్రజలు సహకరించాలని సూచించారు. పంచాంగకర్తకు ఆత్మీయ సత్కారం పంచాంగ శ్రవణం చదివి వినిపించిన పంచాంగ కర్త రొంపిచర్ల సింగరాచార్యులకు జిల్లా అధికార యంత్రాంగం ఆత్మీయ సత్కారం చేసింది. ధృవీకరణ పత్రంతో పాటు జ్ఞాపికను అందజేశారు.

# యావదాస్తిని పేదలకు పంచిన మహనీయుడు



- భూ పోరాటాలకు నాంది పలికి పేదలకు జీవనోపాది కల్పించిన సిఆర్
- సిపిఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా వర్ధంతి వేడుకలు

**కొత్తగూడెం, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** దేశవ్యాప్తంగా భూపోరాలకు శ్రీకారం చుట్టి నిరుపేద కుటుంబాలకు జీవనోపాది కల్పించిన చంద్ర రాజేశ్వరరావు చిరస్మరణీయుడని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ అగ్రనాయకులు,మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వర్‌రావు 30వ వర్ధంతిని మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగరిభవన్‌లో ఘనంగా నిర్వహించారు.తొలుత సిఆర్ చిత్ర పఠానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటైన సంస్మరణ సభలో కూనంనేని మాట్లాడారు.జమీందారి కుటుంబంలో జన్మించి కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆకర్షితుడై తన యావదాస్తిని పేదలకు పంపిణీ చేసిన మహనీయుడు చంద్ర రాజేశ్వర్‌రావు అని కొనియాడారు.పేదలకు భూమి దక్కితనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని విశ్వసించిన సిఆర్ దేశవ్యాప్త భూ పోరాటాలకు నాంది పలికాడన్నారు. మహిళలపై దాడులు, అరాచకాలను, ఉద్యమాల అణచివేతకు పూనుకుంటున్న ప్రభుత్వాలకు అడ్డుకట్ట వేసేందుకు ఉద్యమాల్లో పాల్గొనే ప్రజలకు రక్షణ కల్పించేందుకు ఆరు దశాబ్దాల క్రితమే జనసేవాదళ్‌ను ఏర్పాటు చేసిన ముందు చూపు ఉన్న మహానేత సీఆర్ అని కొనియాడారు. పేద ప్రజల అభ్యున్నతికోసం అహర్నిషలు శ్రమించి అమరులైన నాటి నాయకులు చూపిన మార్గంలో పయనించి ప్రజా ఉద్యమాలకు నిర్మించడమే వారికి ఇచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు జి.వీరస్వామి, కె.రత్నకుమారి, నాయకులు మాతంగి లింగయ్య, మాటేటి గోపాల్స్ లక్ష్మి నారాయణ, గోపి, రాము, భూపేష్, హరీష్, భాగ్యలక్ష్మి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



నారాయణపేట పరిధిలోని బొమ్మన్ పాడు గ్రామానికి చెందిన బి. మహేష్ సింగ్ బైక్ పై లిక్కర్ తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. పేట రూరల్ ఎస్సై కృష్ణదేవ్ విచారించి అతని వద్ద 36.05 లీటర్ల లిక్కర్, వాటి విలువ 15,862/- రూపాయలు ఉంటుందని ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమంగా మద్యం తీసుకెళుతున్నందున బి మహేష్ సింగ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని రూరల్ ఎస్సై కృష్ణదేవ్ తెలిపారు.

*-నారాయణపేట, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):*

## ఉగాది పచ్చడి పంపిణీ



**నల్లకుంట, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** ఉగాది పర్వదినం సందర్భంగా గోల్నాక విజిటబుల్ మార్కెట్ హనుమాన్ నగర్ లోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం వారి ఆధ్వర్యంలో భక్తులకు పచ్చడిని పంపిణీ చేశారు. పండుగ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిర్వాహకులు భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు నరసింహ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి అంతటి శ్యామ్, కోశాధికారి లక్ష్మణ్ కాక, సతీష్ ముదిరాజ్, శేఖర్, సత్యనారాయణ చారి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవల్లి దేవసేన స్వామి వారికి అభిషేకాలు

### ఆలయ చైర్మన్ మహాసముద్రం పట్టాభి రెడ్డి



**చంద్రగిరి, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** పాకాల మండలం ఊట్లవారిపల్లి సమీపాన ఆనందగిరిపై వెలసిన శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి అభిషేకాలు,పుష్పాలతో ప్రత్యేక అలంకరణ,పూజలు నిర్వహించామని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ చైర్మన్ పట్టాభి రెడ్డి మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మహాసముద్రం పట్టాభి రెడ్డి మాట్లాడుతూ భక్తులకు ప్రజలకు ముందుగా శ్రీ క్రోధి నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నూతన తెలుగు ఉగాది సందర్భంగా శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఈ.ఓ యువరాణి,జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్, ఆలయ సిబ్బంది భాస్కర్,మణి,తదితరులు పాల్గొన్నారు.



హెచ్ బీ కాలనీ కృష్ణానగర్ లో గల శ్రీ గోదా రంగనాథ స్వామి ఆలయ తెలుగు క్యాలెండర్ ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ తో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఛైర్మన్ డాక్టర్ ధనుంజయ్ పాల్గొన్నారు.

*-మౌలాలి, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):*

## పెబ్బేరులో ఉగాది పచ్చడి పంపిణీ



**పెబ్బేరు, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో తెలుగు నూతన సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా పెబ్బేరు హిందూ జాగృతం ఆధ్వర్యంలో మంగళవారం ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. శ్రీరాముని చిత్రపటానికి ప్రత్యేక పూజలు గోవర్ధన్ ఆచారి, నవీన్ శర్మ సౌజన్యంతో నిర్వహించారు. పూజా కార్యక్రమం అనంతరం పెబ్బేరు పట్టణ ప్రజలకు ఉగాది పచ్చడిని ప్రసాదంగా వితరణ కార్యక్రమం పెబ్బేరు హిందూ జాగృతం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై హరి ప్రసాద్ రెడ్డి, హిందూ టైగర్ వేమారెడ్డి,వేణు (ఆర్ట్స్), కృష్ణ కుమార్ రెడ్డి,రమణ, టీవీఎస్ బుజ్జి,బాల్ రాం, రామకృష్ణ, సహదేవుడు,గుర్రం గడ్డ.శ్రీనివాస్ రెడ్డి, కర్నాటి.శ్రీనివాస్ గౌడ్, మంగరాయి మన్యం, దుర్గ ప్రసాద్ పెబ్బేరు హిందూ జాగృతం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మేకల మందులో వచ్చిన జింకపిల్ల



**నారాయణపేట, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధిలో కొల్లంపల్లి కి చెందిన తుప్పలప్ప అనే వ్యక్తి మేకల మందలో జింక పిల్ల కలిసి వచ్చింది. ఈ విషయాన్ని ఆయన టాస్క్ ఫోర్స్ కానిస్టేబుల్ రామ్ కుమార్ తెలుపగా, అతను నారాయణపేట ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సంతోష్ కుమార్ కు సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ కథలప్ప జింక పిల్లను ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అప్పగించడం జరిగిందని తెలిపారు.



గండిపేట మండలం మణికొండ మున్సిపల్ పరిధిలో నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలిగిన టోల్ ఫ్రీ నంబర్లను 155313,1800 599 7575 సంప్రదించవలసిందిగా మణికొండ మున్సిపల్ కమీషనర్ ప్రదీప్ కుమార్,మున్సిపల్ ప్రజలను కోరారు.

*–రాజేంద్రనగర్, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):*

## శిల్పారామంలో పంచాంగ శ్రవణం

### అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన





**ఉప్పల్, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** ఉప్పల్ మినీ శిల్పారామంలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. జ్యోతిష్కులు, పంచాంగ కర్త బ్రహ్మ సోమనాథ శాస్త్రి చే పంచాంగ శ్రవణం చేశారు. ఉగాది పండుగ విశిష్టత, కాలానుగుణంగా మారె ఋతువులు వాటి ప్రభావాలు, ద్వాదశ రాశులు ఆదాయ వ్యయాలు, సంవత్సర ఫలితాలు, పరిహారాలు ఏమి చేసుకోవాలి మొదలైన వాటిగురించి సవివరంగా వివరించారు. నాట్య గురువర్యులు వాణి రమణ, చంద్రశేఖర్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ఆద్యంతం అలరించింది. గణపతి కౌతం, పుష్పాంజలి, మూషిక వాహన, బ్రహ్మాంజలి, రామకోదండ రామ, శివ అష్టకం, కామాక్షి స్తుతి, కళింగనర్తన, గోవర్ధన గిరి ధారి, తిల్లాన మొదలైన అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.

## చలివేంద్రం ప్రారంభం




**మేడ్చల్, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం మేడ్చల్ వారి ఆధ్వర్యంలో ఆదిత్య బైక్ జోన్ అధినేత ఆకుల సీతారాం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎండలు రోజురోజుకి పెరుగుతున్న దృష్ట్యా ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నడికట్ల వెంకట సుబ్బారావు, కాపు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉగాది వేడుకలు



**అబ్దుల్లాపూర్ మెట్, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధి కవాడుపల్లి గ్రామంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను పురస్కరించుకొని గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో పండితుడు వినయ్ కుమార్ పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. భక్తులు తమ రాశి ఫలాలతో పాటు రాజ్యపుజం అవమానాలు అదృష్ట సంఖ్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వ దినాన్ని పునస్కరించుకొని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మంగళవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దర్శించుకొని అంబర్ పేట ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

*– అంబర్ పేట, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):*

# మహాత్మ పూలే అంబెద్కర్.. జయంతి ఉత్సవాల శోభాయాత్ర



**ఖమ్మం, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** మహాత్మ జ్యోతిబా పూలే, భారత రత్న అంబెద్కర్ ల జయంతి ఉత్సవాల శోభాయాత్ర ఏప్రిల్ 11న జరుగుతుందని, ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అంబెద్కర్, మహాత్మ జ్యోతిబాపూలే జయంతి ఉత్సవాల శోభాయాత్ర ఖమ్మం అంబెద్కర్ సెంటర్ నుండి పూలే ప్రాంగణం వరకు పల్లకితో శోభాయాత్రకు ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రోగ్రాం కన్వీనర్ దాసరి రాజశేఖర్ అధ్యక్షతన మహాత్మ జ్యోతిబాపూలే ఐడియాలజి సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు పెళ్ళూరి విజయ కుమార్, సేవాలాల్ సేన రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాణోతు కిషన్ నాయక్, ముస్లిం జెఎసి చైర్మన్ ఎస్.కె. రెహ్మాన్, తెలంగాణ బి.సి. జెఏసి ఛైర్మన్ పెరుగు వెంకట రమణ యాదవ్, ప్రోగ్రాం కో కన్వీనర్ మాదిగ సంఘం నాయకులు పగిడి ముక్కల విజయకుమార్ మంగళవారం స్థానిక జ్యోతిబాపూలే ప్రాంగణం నందు శోభాయాత్ర కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్త పౌరసమాజం కదలి శోభాయాత్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూలే అంబేద్కర్ వాది సంకినేని వంశి, దలిత హక్కుల పోరాట సమితి డి.హెచ్.పి.ఎస్ జిల్లా కార్యదర్శి మంద వెంకటేశ్వర్లు, గరిడేపల్లి సత్యనారాయణ, జెబిసిఎస్. ఖమ్మం టౌన్ అధ్యక్ష కార్యదర్శులు గద్దె వెంకట రామయ్య, కేతనబోయిన నాగేశ్వరరావు, బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర నాయకులు పొడగంటి రాంబాబు, టి.ఎస్.జె. బి.సి.జె.ఎస్.ఖమ్మం జిల్లా ఇన్చార్జి కందిమళ్ళ చంద్రశేఖర్, టి.బి.సి.జె.ఎ.సి. జిల్లా అధ్యక్షులు అర్వపల్లి కోటేశ్వరరావు, జాయింట్ కో కన్వీనర్ మద్దెల పుల్లారావు ముదిరాజ్, లింగనబోయిన లక్ష్మణ్ ముదిరాజ్, బెజ్జంకి ప్రభాకర్, మాదగాని మహేష్ అరెంపుల విజయగోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కిష్టాపూర్ లో పంచాంగ శ్రవణం





**మెదక్, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** తూప్రాన్ మండల్ కిష్టాపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయంలో స్థానిక తాజా మాజీ సర్పంచ్ పీట్ల పోచయ్య ముదిరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈయన ఆధ్వర్యంలో ఉగాది నూతన పంచాంగాన్ని వేద బ్రాహ్మణులు వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనూతన సంవత్సరంలో సమృద్ధిగా వర్షాలు కురిపించి పంటలు బాగా పండిపాడీ పంటలతో ఇంటిల్లిపాదికి శుభాలను కలిగించాలని భగవంతుని కోరుకున్నట్లు తెలిపారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామంలో మంగళవారం ఉగాది పండుగను గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. తీపి, వగరు, పులుపు, చేదు, కారం లవణం తదితర షడ్రుచులలో ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. అనంతరం సాయంత్రం పంచాయతీ కార్యాలయం వద్ద తాజా మాజీ సర్పంచ్ పిట్ల పోచయ్య ఆధ్వర్యంలో పంచాంగ పఠనం కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు. క్రోధి నామ సంవత్సరంలో పాడిపంటలు, వర్షాలు, ఆర్థిక పరిస్థితులు, ఆదాయ వ్యయాలు, వాతావరణ పరిస్థితులు తదితర విషయాల గురించి పురోహితుడు సలాక రాజేశ్వర్ శర్మ గ్రామస్తులకు పంచాంగాన్ని చదివి వినిపించారు. పంచాంగ శ్రవణ కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కొత్త ఏడాదిలో జరిగే శుభ, అశుభ, లాభ నష్టాల గురించి ఆసక్తిగా విన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ శ్యామ్ సుందర్ రెడ్డి, తాజా మాజీ వార్డ్ మెంబర్లు బీఆర్ఎస్ నాయకులు క్రిష్ణారెడ్డి, మల్లారెడ్డి, చుక్క శ్రీశైలం, శ్రీశైలం గౌడ్, మాజీ సర్పంచి వెంకటేశం రవి ముదిరాజ్, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చిలుకానగర్ లో ఉగాది పచ్చడి పంపిణీ



**చిలుకానగర్, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని చిలుకా నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ములకల రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం చిలుకా నగర్ చౌరస్తాలో ఉగాది పచ్చడి అందరికి పంచి పండుగను జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఘుపతి రెడ్డి ఆగం రెడ్డి ఉప్పల్ నియోజవర్గం మహిళా అధ్యక్షురాలు అమరేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ తెలుగు సంవత్సర ఉగాది పర్వదినం అందరి జీవితాల్లో వెలుగు నింపాలని ప్రతి ఒక్కరు ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం చిలుకా నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ములకల రాజేష్ మాట్లాడుతూ చిలుకానగర్ లో నిరుపేదలైన ప్రజలకోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేయడం జరిగిందన్నారు వారితో కలిసి ఉగాది పండుగను జరుపు కుంటున్నందుకు సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజులలో చిలుకానగర్ డివిజన్ ప్రజలకోసం పోరాడుతానన్నారు. చిలుకానగర్ డివిజన్ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అదే విదంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిలుకానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంచాల రఘు ఉపాధ్యక్షులు గండికోట గణేష్ ఏడ్ల అంజయ్య ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి మహేందర్ జగదీష్ హాసన్ బల్వందర్ రాజేష్ బీసీ సెల్ అధ్యక్షులు దండుగుల శంకర్ ఎస్ సీ సెల్ అధ్యక్షులు పస్తం శ్రీరామ్ పూర్ణ మైనారిటీ సెల్ అధ్యక్షులు మొయినుదిన్ చిలుకానగర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సత్యం చిలుకానర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సుబ్బారావు డేవిడ్, రాధాకృష్ణ గందమల్ల జంఘీర్ భాస్కర్ కిరణ్ సుదర్శన్ సురేందర్ మహిళా నాయకురాలు సమత తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పెగడపల్లిలో నూతన ప్రెస్ క్లబ్ ప్రారంభం



### జర్నలిస్టులకు డిజెఎఫ్ అండగా ఉంటుంది

**ధర్మపురి, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** పెగడపల్లి మండల కేంద్రంలో డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నూతన ప్రెస్ క్లబ్ కార్యాలయంను తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోటపలుకుల వెంకట్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ప్రెస్ క్లబ్ సభ్యులు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పత్రికలు,మీడియా ఛానల్ లు పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలపై వార్తలను ప్రచురిస్తూ ప్రభుత్వానికి తట్టి లేపే విధంగా ప్రజలకు న్యాయం జరిగేలా పత్రికా మిత్రులు నిరంతరం కృషి చేయాలని అన్నారు. డిజేఎఫ్ యూనియన్ ముఖ్యంగా జర్నలిస్ట్ ల సమస్యలపై పోరాడేందుకు ఎల్లప్పుడూ ముందుంటుందని జర్నలిస్టుల హక్కుల సాధన కోసం డీజేఎఫ్ అండగా ఉంటుందని పేర్కొన్నారు. చిన్న పెద్ద పత్రికలు అనే తారతమ్యం లేకుండా అందరూ కలిసికట్టుగా ప్రజల సమస్యలపై, సమాజంలో జరుగుతున్న అక్రమాలపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెగడపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తొట్ల గంగాధర్, గౌరవ అధ్యక్షులు చెట్ల తిరుపతి, ప్రధాన కార్యదర్శి ఏదుల్ల రమేష్,ఉపాధ్యక్షుడు పోర్తి మహేష్,కోశాధికారి చిన్నం తిరుపతి,బత్తుల ప్రదీప్,గురిజల తిరుపతిరెడ్డి,చెట్ల శ్రీనివాస్,గుండా రాకేష్,శ్రీధర్,ఆత్మకూరి చందు,చెట్ల రాజు,పంతగాని శంకర్,వివిధ మండలాల ప్రెస్ క్లబ్ సభ్యులు,జర్నలిస్టులు పాల్గొన్నారు.

# భువనగిరిలో కాంగ్రెస్ విజయం ఖాయం: దేగల



**భువనగిరి, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ భువనగిరి పార్లమెంటుకు జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుపొందటము ఖాయమని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు దేగల అంజయ్య యాదవ్ వలిగొండ పార్టీ కార్యాలయం లో చెప్పారు. బీజేపీ బిఆర్ఎస్ లను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని తెలిపారు. పేద ప్రజల కోసం ఎన్నికల మ్యానిఫెస్టోను అనేక హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని చెప్పారు. రాష్ట్రములో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత గత నాలుగు నెలల్లో ఆరు గ్యారంటీలను అమలు చేసిందని తెలిపారు అధికారం కోసం నాలుగు నెలలకే ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు ఎవరెన్ని కుట్రలు చేసిన కాంగ్రెస్ 17 స్థానాలు భారీ మెజారిటీతో గెలుస్తామని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ వంగాల అశోక్ గౌడ్ ఈతప రాములు మమ్మద్ హైమద్ ఎలిమినేటి సుధాకర్ రెడ్డి జక్కజంగారెడ్డి చిట్యాల స్వామి గుండు దానయ్య గౌడ్ గంగపురం దైవదినంగౌడ్ బండారు నర్సింహారెడ్డి దేశబోయిన బాలస్వామి యాదవ్ జువ్వగాని నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కొత్త ఆశలు చిగురించే ఉగాది అంటే అందరికీ గుర్తుకు వచ్చేది తెలుగువారి పండగ తెలుగు సంవత్సరం ప్రారంభమవుతుందని ఉత్తర నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు అన్నారు. బాలయ్య శాస్త్రి లేఅవుట్ వద్దనున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో పంచాంగ శ్రవణం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలో భాగంగా ప్రముఖ వేదాంతిచే పంచాంగ శ్రవణం చేశారు.

*–విశాఖపట్నం, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):*

## వైసీపీలోకి భారీగా చేరికలు



**విశాఖపట్నం, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** సంక్షేమ పాలన కోసమే టిడిపి నుంచి వైసీపీకి చేరికలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే కన్నబాబు మున్సిపల్ చైర్ పర్సన్ పీలా రామాకుమారి డిసిసిబి మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ అన్నారు. టిడిపి నుంచి నాయకులు కార్యకర్తలు 200 మంది ఎమ్మెల్యే సమక్షంలో మంగళవారం వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏపీలో సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైసీపీలో చేరుతున్నార న్నారు.

## మత్స్యగిరిలో పంచాంగ శ్రవణం



**వలిగొండ, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** వలిగొండ మండలం శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఉగాది పర్వదిన సందర్భంగా శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధృవమూర్తికి నవ కలశ స్నపనం, విశేష అలంకరణ, సుదర్శన హోమము, శ్రీ స్వామివారి కళ్యాణం పంచాంగ శ్రవణం జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి, విద్యుత్ శాఖ ఏ ఈ మచ్చేందర్ వారి సిబ్బంది ఆలయ అర్చకులు వేద పండితులు సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన కౌన్సిలర్ వెంకట రమణ



**కీసర, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో దమ్మాయిగూడ మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ వెంకటరమణ వారి అనుచరులతో సుమారు 11మంది కార్యకర్తలతో మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బిజెపి పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి సమక్షంలో బీజేపీ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. భారతదేశం కోసం ధర్మం కోసం అనే నినాదంతో ప్రధాని మోడీ వెంట ఉంటూ గెలుపుకు కృషి చేస్తానని ప్రమాణం చేసి పార్టీలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్ర రెడ్డి,మేడ్చల్ జిల్లా అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, నాగారం మున్సిపల్ కౌన్సిలర్ శ్రీను, మాజీ వార్డ్ మెంబర్ మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింలకు నిత్యవసరాలు పంపిణీ



**వలిగొండ, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** వలిగొండ మండలం మొగిలిపాక గ్రామం లో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ముద్దేసాని కిరణ్ కుమార్ రెడ్డి 60 ముస్లిం కుటుంబాలకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బిక్షపతి పాల సంఘం చైర్మన్ సత్తయ్య మాజీ సర్పంచ్ శంకరయ్య మాజీ ఉప సర్పంచులు నరసింహ విష్ణు చారి, ఇంద్రారెడ్డి, సత్య రాములు, మైనార్టీ నాయకులు సయ్యద్, మౌలానా ఖాసీం మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం బర్కత్ పురా బిజెపి సెంట్రల్ జిల్లా కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎలక్షన్ లీగల్ సెల్ ఆఫీసునుప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి కార్యాలయం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి లీగల్ సెల్ కన్వీనర్ గోకులే రామారావు, ప్రభాకర్ రెడ్డి, అంతోని రెడ్డి, జనార్ధన్ గౌడ్, చింతల కృష్ణ, గిరి భాస్కర్, పుట్ట సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

*–బర్కత్ పుర, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):*

## యాదవ యూత్ జిల్లా అధ్యక్షులుగా సాగర్



**ధర్మపురి, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** అఖిల భారత యాదవ మహాసభ యూత్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుగా పాలితం గ్రామానికి చెందిన అట్ల సాగర్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర యూత్ అధ్యక్షులు ఏ.రమేష్ యాదవ్ మంగళవారం సాగర్ యాదవ్ కు నియామక పత్రం అందించారు. యాదవ యూత్ సభ్యుల బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తానని సాగర్ పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర యూత్ అధ్యక్షులు రమేష్ జిల్లా యాదవ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వైసీపీని బలపరచండి

### వంకాయల తాతాజీని కలిసిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్



**విశాఖపట్నం, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** సీనియర్ రాజకీయ నాయకులు శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయలు తాతాజీ, ఎస్ విటి గ్రూప్స్ అధినేత సత్యనారాయణ లను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆత్మీయంగా కలిశారు. మంగళవారం సాయంత్రం స్వయంగా వారి వద్దకు వెళ్లి పేదల వైసిపి ప్రభుత్వంకి మద్దతు తెలపాలని కోరారు. వారితో కాసేపు ముచ్చటించారు. అత్యధిక ఓటర్ల ప్రభావితం చేసే పెద్దలు ఆశీర్వచనాలు తీసుకోవడం జరిగిందన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలని వాసుపల్లి కోరారు. వారు స్పందిస్తూ కచ్చితంగా వైసీపీ ప్రభుత్వాన్ని అధికారంలో తీసుకువచ్చేందుకు తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రామానంద్ పాల్గొన్నారు.

## వైసీపీలోకి కొనసాగుతున్న వలసలు

### భూమన కరుణాకర రెడ్డి సమక్షంలో భారీగా చేరికలు



**తిరుపతి, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** తెలుగుదేశం కాంగ్రెస్ పార్టీ ల నుంచి వైఎస్సార్ సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. స్థానిక 8వ డివిజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు యామాతి ప్రభాకర్ రెడ్డి ఆ పార్టీని వీడి, తన అనుచరులతో కలిసి వైఎస్సార్ సీపీలో వైసీపీలో చేరారు. కార్పొరేటర్ తిరుపతి మునిరామి రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరగా భూమన కరుణాకర రెడ్డి వారికి కండువాలు కప్పి వైఎస్సార్ సీపీ లోకి ఆహ్వానించారు. ఇదే డివిజన్ కు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు నచ్చు చంద్రాయాదవ్ ఆ పార్టీకి గుడ్ బై కొట్టి, వైఎస్సార్ సీపీలో చేరారు.తిరుపతి ముని రామిరెడ్డి, బెల్లం రమేష్ ఆధ్వర్యంలో తన అనుచరులతో కలిసి వైఎస్సార్ సీపీలో చేరగా, వారికి భూమన కరుణాకర రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## ఈ ఏడాదంతా శుభం జరగాలి

### ఉగాది వేడుకల్లో పులివర్తి నాని



**చంద్రగిరి, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** క్రోది నామ సంవత్సరంలో అంతా శుభం జరుగుతుందని చంద్రగిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. మంగళవారం తిరుపతి రూరల్ మండలంలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఉగాది అమావాస్య పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పులివర్తి నాని వేడుకల్లో పాల్గొని పచ్చడి స్వీకరించి ఉగాది పచ్చడి వలె జీవితం కూడా షడ్రుచుల మాదిరిగా ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, అష్ట ఐశ్వర్యాలతో, పాడి పంటలతో వర్ధిల్లాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

# మహనీయుల ఉత్సవ.. శోభాయాత్రను

# ఘనంగా నిర్వహించాలి

### డిఎస్పీ మండల ఉపాధ్యక్షుడు ముస్త్యాల శ్రీకాంత్



**సిద్ధిపేట, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండల పరిధిలోని జప్తి నాచారం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన ధర్మ సమాజ్ పార్టీ కొండపాక మండల ఉపాధ్యక్షుడు ముస్త్యాల శ్రీకాంత్ సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 11వ తేదీన పీడిత ప్రజల విముక్తి ప్రదాతలు అయిన మహాత్మ జ్యోతిరావుపూలే, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కాన్సిరామ్ జన్మదిన ఉత్సవాలను పురస్కరించుకుని జరగబోయే సభను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ మన దేశంలోని తెలంగాణ రాష్ట్రంలో తొంభై శాతం ప్రజలు వేల సంవత్సరాలుగా కుల వ్యవస్థ కారణంగా అణచివేతకు పీడనకు, వివక్షకు గురై విద్యకు, భూమికి, సంపదకు, రాజ్యాధికారానికి దూరమై దుర్భరంగా బ్రతుకుతూ తరతరాలుగా తమ జీవితాన్ని కోల్పోయారు. అలాంటి ప్రజల బాధల నుండి విముక్తి కల్పించడానికి ఆ పీడిత సమాజం నుండే విముక్తి ప్రదాతలు జన్మించారు. వారే జ్యోతిరావుపూలే, డాక్టర్ అంబేద్కర్, సాహు మహారాజ్, కాన్షిరాం, వీరి సామాజిక, రాజకీయ యుద్ధం వలెనే నేడు తొంభై శాతం మన బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలు భారత రాజ్యాంగం ద్వారా మానవ హక్కుల పొంది బ్రతుకుతున్నారు. అందుకని మన బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలు మన మహనీయుల పోరాట మార్గంలో నడిచి వారి ఆశయాలు ఫలించడానికి తెలంగాణలో మూడున్నర కోట్ల మంది మన ప్రజాబలగం ఒకటై రాజకీయ యుద్ధం చేయాలి రాజ్యాధికారాన్ని సాధించాలి అదే మనం మన మహనీయులకు అందించే ఘన నివాళి. అందులో భాగంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 11 వ తారీకు మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి రోజున ఐదు వందల మందితో శోభాయాత్ర, భారీ సభను ఏర్పాటు చేయడం జరుగుతోంది దీనికి అన్ని వర్గాల ప్రజలు, మేధావులు విద్యావంతులు ప్రజాస్వామ్య వాదులు అందరూ భాగస్వాములు కావాల్సిందిగా మరియు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముస్త్యాల ఉమాకర్, ముస్త్యాల తిరుపతి, దాసరి పురుషోత్తం, ముస్త్యాల నవీన్, ముస్త్యాల రాకేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## తితిదే ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం



**కర్నూలు, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** శ్రీ క్రోధినామ సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కర్నూలు నగరం, కుమ్మరి వీధిలోని శ్రీరాంబోట్ల దేవస్థానం నందు శ్రీపాద నరేశ్ కుమార్ శర్మచే పంచాంగ పఠనం చేయించారు. ఈ సందర్భంగా వారు రాజాది నవనాయకుల ఫలితాలు, ద్వాదశ రాశుల ఫలితాలు వినిపించారు. ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ నగరూరు దీప్తి, కార్పోరేటర్ శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.దినేశ్, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, ధర్మ ప్రచార మండలి సభ్యులు పసుపులేటి నీలిమ, ముద్రికా కళాశ్రవంతి అధ్యక్షులు పి.వి.భాస్కర్, అర్చకులు కె.గిరీశ్వర శర్మ, ఆలయ కమిటీ సిబ్బంది పెద్ది శ్రీనివాసులు కృష్ణ కాంత్ శర్మ, జె.విజయ్ కుమార్ , సంపతి రామకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ పట్నాలకు చందా అందజేత



**రామడుగు, ఏప్రిల్ 09 (నిఘా న్యూస్):** రామడుగు మండలం కొక్కెరకుంట గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాల (లంద) కొరకు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ మంగళవారం ఆరు వేల రూపాయల చందా అందజేశారు.

## ధర్మపురిలో కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం

### ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం కలిసికట్టుగా పని చేయాలి



**ధర్మపురి, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** ధర్మారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని మంగళవారం రోజున ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మండల నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలు పార్టీ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు తీసుకోవాల్సిన చర్యల పై పార్టీ నాయకత్వానికి దిశ నిర్దేశనం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా ధర్మపురి నియోజక వర్గ ప్రజానీకానికి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నామన్నారు.పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ స్వాగతం పలుకుతున్నామని,గత 15 సంవత్సరాలు ఇక్కడ ప్రతి ప్రాతినిధ్యం వహించిన కొప్పుల ఈశ్వర్ ఇ ప్రాంతానికి చేసింది ఏమీ లేదని ప్రజలు గుర్తించి ఓడగొట్టడం జరిగిందని,ఇప్పుడు మళ్లీ ఎంపి అభ్యర్థిగ పోటీ చేస్తు గడ్డం వంశీని,వివేక్ ని డబ్బులు గల వ్యక్తులు అని చెప్పడం జరుగుతుంది. 2004 లో కొప్పుల ఈశ్వర్ ఆస్తులు ఎన్ని,మొన్నటి అసెంబ్లీ ఎన్నికల వరకు ఆస్తులు ఎన్నో ప్రజలకు సమాధానం చెప్పాలి.పంటలు ఎండి పోతున్నాయని దొంగ దీక్షలు చేస్తున్న కొప్పుల ఈశ్వర్ ఈ సమస్యకు కారణం మీరు కాదా అని,రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఏమి అభివృద్ధి చేసిందో భవిష్యత్తులో ఎటువంటి అభివృద్ధి చేస్తుందో ప్రజల ముందుకు తీసుకువెళ్తామని పెద్దపెల్లి పార్లమెంట్ ఎంపి గా వంశీని గెలిపించేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కలిసి కట్టుగా పని చేయాలని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి,మాజీ ఎంపీపీ కొడారి అంజయ్య, ఉపాధ్యక్షులు కాంపెల్లి రాజేశం,దేవి జనార్ధన్ కాడే సూర్యనారాయణ, కొత్త నరసింహులు,ఓరెం చిరంజీవి, దేవి లావణ్య, నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ లో పంచాంగ శ్రవణం

### మీడియా మిత్రుల మధ్య ఘనంగా ఉగాది



**తిరుపతి, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** ఉగాది పండుగను పురస్కరించుకొని ప్రతి ఏడాది లాగే స్థానిక శ్రీదేవి కాంప్లెక్స్ లోని తిరుపతి ప్రెస్ క్లబ్ నందు మంగళవారం ఘనంగా ఉగాది పండుగను జరుపుకున్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జోగిరెడ్డి భాస్కర్ రెడ్డి.బాలచంద్రల ఆధ్వర్యంలో బ్రాహ్మణ సమాజం సభ్యులు సి ఆర్ కె శేషగిరిరావు, హనుమంతరావు. ఉప్పు కొండూరు సూర్య ప్రకాష్ అవధానిలు విచ్చేసి పంచాంగ శరణం చేసి ఈ ఏడాది అన్ని రాశుల వారి స్థితిగతులను పంచాంగం శ్రవణం ద్వారా తెలియజేశారు.ఈ ఉగాది వేడుకలలో సీనియర్ పాత్రికేయులు, మీడియా మిత్రులు పాల్గొనగా ప్రెస్ క్లబ్ సిబ్బంది ఉగాది పచ్చడి తోపాటు ప్రసాద వితరణ చేశారు.



పీర్జాధిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శ్రీ వైష్ణవ సేవ సంఘము ఆధ్వర్యంలో విష్ణుపురి కాలనీలోని హనుమాన్ ఆలయంలో శ్రీ క్రోధినామ సంవత్సర పంచాంగం సంఘం సభ్యుల మధ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఆరుట్ల కరుణాకరా చార్యులు, ఉపాధ్యక్షులు మరిగంటి అరుణ్ స్వామి, ప్రధాన కార్యదర్శి ఆరుట్ల గోపి, గౌరవ సలహాదారులు అప్పలా చార్యులు, శ్రీధరా చార్యులు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

*– పీర్జాదిగూడ, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):*

## భూమన అభినయ్ ను ఆశీర్వదించండి

- ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే భూమన
- భూమన వెంటే ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం..



తిరుపతి, ఏప్రిల్ 10(నిఘా న్యూస్): టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మంగళవారం సాయంత్రం స్థానిక 8,9 వ డివిజన్ల పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం వెంట రాగా, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ తిరుపతి మునిరామి రెడ్డి ఆధ్వర్యంలో 8 వ డివిజన్ లో ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ లీలావతి ఆధ్వర్యంలో 9 వ డివిజన్ లో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర రెడ్డి ఇంటింటికీ కర పత్రాలు అందజేస్తూ ఫ్యాన్ గుర్తుకే ఓట్లు వేయాలని అభ్యర్థించారు. తిరుపతి ఎమ్మెల్యేగా భూమన అభినయ్ ని, ఎంపీగా గురుమూర్తిని గెలిపించాలని కోరారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూటమికి పొరబాటుగా ఓట్లు వేస్తే సంక్షేమ పథకాల రద్దుకు ఆమోదముద్ర వేసినట్టే అవుతుందని అందుచేత చంద్రబాబు,పవన్ కల్యాణ్ కూటమిని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటే సంక్షేమ పథకాలు రెట్టింపుగా అమలు అవుతాయని భరోసా భూమన ఇచ్చారు. భూమన ఎన్నికల ప్రచారానికి అశేష జనవాహిని బ్రహ్మరథం పట్టింది.

# ఆటలమ్మతో చిన్నారులు అప్రమత్తం



తోటి డాక్టర్లకు, ఆసుపత్రి వైద్య సిబ్బందికి, ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

### చిన్నారుల వైద్య నిపుణులు డాక్టర్ జ్యోత్స్న

**తాండూరు, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** ఉష్ణోగ్రతలో వచ్చే తేడాల వలన, వేసవి కాలంలో ముఖ్యంగా ప్రస్తుతం కొనసాగుతున్న ఎండాకాలం ఆరంభంలోనే ఆటలమ్మ, అమ్మవారు (చికెన్ పాక్స్) విస్తరిస్తుందని చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జ్యోత్స్న వెల్లడించారు. ఇది సంక్రమించడానికి మూల కారణం వారి సెల్లా జోస్టర్ వైరస్ ద్వారా చికెన్ పాక్స్ సంక్రమిస్తుందని తెలిపారు. వారి సెల్లా జోస్టర్ వైరస్ ద్వారా సంక్రమించే ఈ వ్యాధిని ప్రాంతీయ భాషలో ఆటలమ్మ, అమ్మవారు అంటారని వెల్లడించారు. వైద్య పరిభాషలో దీనిని చికెన్ పాక్స్ అంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జ్యోత్స్న మాట్లాడుతూ తాండూరు పట్టణ కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మూర్తి ఆధ్వర్యంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు నవజాత శిశువులకు, చిన్నారులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. ఆటలమ్మ , అమ్మవారువ్యాధి లక్షణాలు అతి జ్వరం, తలనొప్పి, శరీరమంతా నొప్పులు, నీరసం, నోటి పూత, ఆకలి మందగించడం తదితర లక్షణాలు కనిపించిన అనంతరం రెండు రోజులలో చర్మం అంతట సన్నటి ఎర్రటి నీటి పొక్కులు దద్దుర్లు గా రావడం కనిపిస్తుంది. అవి నీటి బుడగలుగా మారడం జరుగుతుందని లక్షణాలు తెలిపారు. చిన్నారులలో ఈ లక్షణాలు కనిపించిన వెంటనే గ్రామీణ ప్రాంతాలలోని చిన్నారుల తల్లులు మూఢ నమ్మకం లో భాగంగా పసరు ఆకులతో శరీరమంతా రుద్దడం పసురు నీరు తాగించడం, పసుపుతో కలిపిన మంచి నూనెను శరీరమంతా రుద్దడం, వేప చెట్టు ఆకులు తినిపించడం, చిన్నారులకు స్నానాలు చేయించకపోవడం తదితర మూఢ నమ్మకాల్లో భాగంగా సొంతం వైద్యం చేయడం జరుగుతుందని వెల్లడించారు. ఇది సరైన పద్ధతి కాదని పునరుద్ధరించారు. పైన లక్షణాలు కనిపించిన వెంటనే చిన్నపిల్లల వైద్య నిపుణులను సంప్రదించడం ఉత్తమమైన మార్గమని హితవు పలికారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు నాణ్యమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని అన్నారు. ప్రాథమిక దశలో ఆస్పత్రికి చిన్నారులను తరలిస్తే ప్రాథమిక వైద్యంతోనే యాంటీవైరస్ ఔషధాలు లేకుండానే వ్యాధి నయం చేయడం జరుగుతుందని భరోసా కల్పించారు. లక్షణాలను నిర్లక్ష్యం వహిస్తే మాత్రం వ్యాధి తీవ్రత పెరుగుతుందని సూచించారు. ఆటలమ్మ, అమ్మవారు అనే వ్యాధి అంటువ్యాధి అని స్పష్టం చేశారు. పైన సూచించిన లక్షణాలు కనిపించిన వెంటనే చిన్నారుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వ్యాధి సంక్రమించిన వారు తుమ్మి నా దగ్గిన తుంపర్ల ద్వారా ఆరోగ్యవంతులకు సంక్రమించడానికి ఆస్కారం ఉందని వివరించారు ఆటలమ్మ వ్యాధి సంక్రమించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. చిన్నారులు వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి పాటించే విధంగా చూడాలి. జ్వరం తగ్గడానికి డాక్టర్లు సూచించిన సూచనల ప్రకారం తగిన మోతాదులో పారాసెటమాల్ మాత్రలు చిన్నారులకు వేయించాలన్నారు. పోషక విలువలతో కూడిన, తేలికగా జీర్ణం అయ్యే ఆహారాన్ని అందించాలని వెల్లడించారు. ఆటలమ్మ వచ్చిన వారితో వారం రోజులపాటు కొంత దూరం పాటించాలని గుర్తు చేశారు ఆటలమ్మ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి, సత్వరమైన వైద్యం తీసుకోవడం ఉత్తమం అని సూచించారు. ముందస్తు టీకా తీసుకోవడంతో ఆటలమ్మ వ్యాధి బారిన పడే వారి సంఖ్య తగ్గుతుందని తెలిపారు. ఉగాది పండుగ దినం ను పురస్కరించుకుని, ఉగాది పండుగ దినంను పురస్కరించుకుని తోటి డాక్టర్లకు, ఆసుపత్రి వైద్య సిబ్బందికి, ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

## పెదిరేపాడులో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



**నారాయణపే, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** మాధుర్ మంపెదిరేపాడుడల కేంద్రంలోని పెదిరేపాడు గ్రామంలో ఎస్సై రామ్ లాల్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు పోలీసులు మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పార్లమెంట్ ఎలక్షన్స్ సందర్భంగా ప్రజలు ధైర్యంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ప్రజలకు భద్రతా, భరోసా కల్పించేందుకు కేంద్ర సాయిధ పోలీస్ బలగాలచే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందని ఎస్సై తెలిపారు. పార్లమెంట్ ఎలక్షన్స్ కు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు తదితరులు పాల్గొన్నారు.

### లవ్ మౌళి చిత్ర ప్రమోషన్..

## నాకు బ్రేక్ ఇచ్చే సినిమా లవ్ మౌళి




**విశాఖపట్నం, ఏప్రిల్ 9 (నిఘాన్యూస్):** యంగ్ హీరో నవదీప్ హీరోగా, పంకురి గిద్వాని హీరోయిన్ గా, అవనింద్ర డైరెక్టర్ గా, సి స్పెస్, నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న లవ్ మౌళి చిత్ర ప్రమోషన్ లో భాగంగా మంగళవారం ద్వారకానగర్ లో గల శరత్ థియేటర్ లో చిత్ర ట్రైలర్ లాంచ్ చేశారు. అనంతరం మీడియా సమావేశంలో హీరో నవ దీప్ మాట్లాడుతూ, తాను విశాఖ రావడం ఆనందంగా ఉందని అన్నారు. ఇక్కడ ఎన్నో చిత్రాల్లో షూటింగ్ లో పాల్గొన్నాను అని గుర్తు చేశారు. ఉగాది రోజున విశాఖ బీచ్ లో గడిపాను. ఇందులో నటించిన భావన విశాఖ అమ్మాయి అన్నారు. తాను ఎంతో ఇష్టం తో చేసిన సినిమా. మేఘాలయ లో 70 రోజుల పాటు కష్టపడి షూటింగ్ జరుపుకుంది అన్నారు. భావన కి తెలుగు లో ఇదే తొలి సినిమా అన్నారు. కథ విషయానికి వస్తె రియల్ లైఫ్ లో మారాలని పిల్లలకు ఇంట్లో పెద్దలు చెబితే గొడవలు వస్తాయి. ఈ పాయింట్ ఆధారంగా విజయేంద్ర ప్రసాద్ టీమ్ సభ్యుడు అవనింద్ర రాసిన, దర్శకత్వం వహించిన కథ అన్నారు. ఇది ప్రేమ మీద తీసిన కథ అయినా విభిన్న కథా చిత్రం అన్నారు. ఇది ట్రు లవ్ అంటే ఏమిటి అన్న కథాంశంగా సినిమా వుంటుంది అన్నారు. బ్రేక్ ఇస్తుంది అని తెలిపారు. న్యూసెన్స్ 2 త్వరలోనే తీస్తాం అన్నారు. ప్రేమికులు మారాలి అనుకున్నపుడే గొడవలు వస్తాయి అన్నారు. ఈ సినిమాతో మరో లెక్క అని చమత్కరించారు. చిత్రం కథ చెప్పినపుడే ట్రూ లవ్ అంటే ఇదా అని తెలుసుకున్నాను. భీమిలి బీచ్ అందాలు ఆస్వాదించిన రోజులు వున్నాయి. సినిమాలో గడ్డం కోసం రెండేళ్లు పెంచాను అన్నారు. సినిమా ఈనెల 19 న విడుదల అవుతుంది అన్నారు. హీరోయిన్ పంకురి గిద్వాని మాట్లాడుతూ, అందరికీ ఈ సినిమా నచ్చుతుంది. షూటింగ్ బాగా ఎంజాయ్ చేశాం. అప్పుడే తెలుగు నేర్చుకున్నాను. చాలా కష్టపడి పని చేశాను అన్నారు. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు అని పేర్కొన్నారు. తాను తెలుగులో నటించిన తొలి సినిమా అన్నారు. మేఘాలయ రాష్ట్రంలో షూటింగ్ సమయంలో తాము ఆర్మీ మాదిరిగా ఫీల్ అయ్యాం అన్నారు. నటి భావన మాట్లాడుతూ తాను విశాఖ అమ్మాయిని ఈ సినిమా చేయడం ఆనందంగా ఉందని అన్నారు. చిత్రం టీజర్ విడుదల అయ్యాక మిగిలిన విషయాలు చెబుతాను అన్నారు. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రేక్షకులతో ముచ్చటించారు. ప్రేక్షకులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు.

## ఇఫ్తార్ విందులో పద్మారావు గౌడ్



**అంబర్ పేట్, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకొని పురస్కరించుకుని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక క్రౌన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ లో ఇఫ్తార్ విందుకార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ బి.ఆర్.ఎస్ పార్టీ ఎం.పి అభ్యర్థి టి.పద్మారావు గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లు విజయ్ కుమార్ గౌడ్, పద్మ వెంకట్ రెడ్డి, మైనారిటీ నాయకులు అఫ్రోజ్, జాఫర్, కబీర్, దావుద్, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

# పీర్జాదిగూడలో చలివేంద్రాలు ప్రారంభం




### ముఖ్యఅతిథిగా పాల్గొన్న తోటకూర వజ్రేష్ యాదవ్

**మేడిపల్లి, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు ఎక్కువ కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పాదాచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు ఆర్ వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చలివేంద్రాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ఆర్ వి ఫౌండేషన్ స్థాపించి తుంగతుర్తి రవి పేదలకు ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలతో పాటు ప్రతి సంవత్సరం మండువేసవిలో పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో రద్దీ ఎక్కువగా ఉండే అనేక ప్రదేశాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి వేలాదిమంది ప్రజల దాహార్తిని తీర్చుతున్నాడని అందుకు తుంగతుర్తి రవిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని అన్నారు. అనంతరం తుంగతుర్తి రవి మాట్లాడుతూ తన వంతు సామాజిక బాధ్యతగా గత కొన్ని సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా ప్రతి సంవత్సరం ఉగాది సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రద్దీ ఎక్కువగా ఉండే మేడిపల్లి పోలీస్ స్టేషన్,హనుమాన్ టెంపుల్ విష్ణుపురి కాలనీ, కార్య సిద్ధి వినాయక ఆలయం మేడిపల్లి, పీర్జాదిగూడ కమాన్ మొత్తం నాలుగు ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, వాహనదారులు, పాదాచారులు చలివేంద్రాలను వినియోగించుకోవాలని అన్నారు. ఈ వేసవిలో ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తుంగతుర్తి రవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, కార్పొరేషన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మలయప్ప స్వామికి ప్రత్యేక పూజలు

### పట్టు వస్త్రాలు సమర్పించిన చెవిరెడ్డి దంపతులు పంచాంగ శ్రవణం చేసిన ఆలయ అర్చకులు



**చంద్రగిరి, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** తుమ్మలగుంట గ్రామంలో వెలసిన శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానాన్ని మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు.తెల్లవారు జామున నాలుగు గంటలకు సుప్రభాతం నిర్వహించాక శుద్ధి నిర్వహించారు.ఆ తర్వాత ఉదయం 6 గంటలకు శ్రీదేవి,భూదేవి సమేత మలయప్పస్వామికి,విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేశారు. ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల మధ్య ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు తీసుకుని ఆలయం ధ్వజస్తంభం చుట్టూ తిరిగి ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించారు.ఆ తర్వాత శ్రీవారి మూలవిరాట్టు, ఉత్సవ మూర్తులకు నూతన వస్త్రాలు ధరింపజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి పంచాగ శ్రవణం చేశారు. ఉగాది ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పంచాంగ శ్రవణం సర్వ కార్య శుభ ఫలప్రదం. ఉగాది రోజు నిర్వహించే పంచాంగ శ్రవణం. సర్వకార్య శుభఫల ప్రధదాయకమని శ్రీక్రోధి నామ సంవత్సరంలో ప్రజలకు అన్ని కార్యాల్లో శుభాలు, ఆయురారోగ్యాలు పుష్కలంగా అందాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలు ఆకాంక్షించారు. స్వామి, అమ్మవార్లకు జరిగిన ఉగాది ఆస్థానం, ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# విశాఖ కాంగ్రెస్ అభ్యర్థిగా సత్యా రెడ్డి



**విశాఖపట్నం, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** 2024 ఎన్నికలలో కాంగ్రెస్ పోటీ పై ఆంధ్ర రాష్ట్రం అత్రం గా చూస్తోంది. ఇలాంటి వేళలో కూటమి పొత్తులో బాగంగా ఎవరి కి ఎక్కడ సీట్ వస్తుంది అని చాలా మంది ఆశా వహూలు కూడా ఆసక్తి గా చూస్తున్నారు. నేడు ఊహాగానాలు గా వస్తున్న వార్తలో కడప నుండి షర్మిల, రాజమండ్రి నుండి గిడుగు రుద్ర రాజు పోటీ కి కాంగ్రెస్ నుండి ఎంపి బరిలో దిగుతున్నారు. కూటమిలో బాగం గా రాష్ట్రంలో కీలకం గా ఉన్న విశాఖ పార్లమెంట్ స్థానం ను తెలుగు సేన పార్టీ అధ్యక్షులు , నిర్మాత, దర్శకుడు సత్యా రెడ్డి కి సీట్ కేటాయించటం ఒక్కసారి గా ప్రజలు అతని కోసం తెలుసుకోవాలి అని వెతుకుతున్నారు. ఎవరు ఈ సత్యా రెడ్డి అని అడిగే వారు మంది గా పెరుగుతూ వచ్చారు. విశాఖలో చాలా మందికి పరిచయస్తుల, సినిమా రంగంలో నిర్మాత మండలిలో చైర్మన్ గా పని చేసిన అనుభవం ఉన్నది అని సినీ వర్గాల కి తెలుసు. చిన్నపట్టి నుండి పోరాటం పై మక్కువ తో ఉన్న అతను విద్యార్థి దశ లో ఇద్దరు ముఖ్యంత్రులు వద్ద స్టూడెంట్ నాయకుడుగా ఎన్నో పోరాటాలు చేసి అందరి కి సహాయ సహకారాలు అందించిన వ్యక్తి సత్యా రెడ్డి. అలా విద్యార్థి దశ లో ఉన్న అతనికి సినిమాలా పై ఉన్న ప్రేమతో నిర్మాత గా 53 చిత్రాలు నిర్మించి, అనతి కాలంలో నిర్మాత మండలి చైర్మన్ గా బాధ్యత నిర్వహించి అందరి తో కలివిడితనం ఎలాంటి సమస్య ఉన్న ఇట్టే పరిష్కరించే శక్తి అతనిలో ఉన్నది. ఇదే సమయం లో జర్నలిజం అంటే ఉన్న గౌరవం తో ఆ విద్యను అభ్యసించి ఓ పత్రిక ను స్థాపించి ప్రజలకు నిజాలు చెరవేయటంలో ముందు అడుగు వేశారు. ప్రత్యేక హోదా కోసం, ఉక్కు కర్మగారాన్ని ప్రైవేట్ పరం చేస్తున్న బిజెపి వైఖరికి ఆక్రోశం గురి అవుతూ అందుకు నిరసన చేస్తూ ప్రజలు మధ్య చైతన్యం కోసం సినిమా నిర్మాణం ముఖ్యం అని అందు కోసం ఉక్కు సత్యాగ్రహం చిత్ర నిర్మాణం చేస్తూ గద్దర్ ను ముఖ్య భూమికగా చేసుకొని ప్రతి విషయంలో గద్దర్ స్ఫూర్తి తో స్థానికుల ను ,నిర్వాసితుల ను చిత్రంలో నటించే లా చేసి చిత్రంను ఓ పోరాటం లా మూడు ఏళ్లు ఎన్నో పాటలు ఉద్యమం కు అందించారు. గద్దర్ ను ఎన్నోసార్లు విశాఖకు తీసుకు వచ్చి అన్ని రకాల గా బిజెపి కుయుక్తులు కు అడ్డు కట్ట వేశారు. సుద్దాల లాంటి వారి తో పోరాట పాటలను ఇచ్చి ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ఇలాంటి నేపథ్యం లో ఉన్న సత్యా రెడ్డి గద్దర్ ను కోలిపోయిన ప్రజలను నేను ఉన్న అనే బరోసా కోసం ఢిల్లీ ఎర్ర కోట వద్దకు స్టీల్ ప్లాంట్ నిర్వాసితులను తీసుకు వెళ్లి అక్కడ తెలుగు సేన పార్టీ స్థాపించి రాజకీయం గా అడుగు వేశారు. ఆనాటి నుండి ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని విధాలుగా తోడు ఉన్న అతను ఇండియా కూటమి లో చేరి తెలుగు ప్రజలకు ఉక్కును, ప్రత్యేక హోదా సాధన కోసం కాంగ్రెస్ చేస్తుంది అనే నమ్మకం తో వారితో కలిసి వెళ్తున్నారు. ఇలాంటి నాయకుడు ను నమ్మిన రాహుల్ గాంధీ, షర్మిల విశాఖ లాంటి ప్రధాన స్థానంను సత్యా రెడ్డికి అప్పగించారు. ఇలా అతనికి సీట్ ఇవ్వటంతో చాలా సంతోషం అన్నారు. గద్దర్ ఆశ విశాఖ ఉక్కు ప్రజలకు హక్కు గా ఉండాలి అందుకోసం పోరాటం చేయటానికి సిద్ధం గా ఉన్నాను. నా పై నమ్మకం ఉంచి ఈ సీట్ ఇచ్చిన షర్మిల, రాహుల్ గాంధీ కి ధన్యవాదాలు. మాటలతో కాకుండా వారికి నేను గెలిచి అదే వారికి బహుమతిగా ఇస్తాను అని అన్నారు. నన్ను గెలిపించి పార్లమెంట్ కు పంపితే విశాఖ ప్రజలకు తెలుగు ప్రజల గొంతుగా పార్లమెంట్ లో ఉంటాను అని తెలిపారు.

# కొత్త సంవత్సరంలో మార్పు ఖాయం

### ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు



**తిరుపతి, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** తెలుగు నూతన సంవత్సరంలో జగనున్న ఎన్నికల్లో తిరుపతిలో జనసేన జెండా ఎగరడం ఖాయమని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు చెప్పారు. జనసేన ఆఫీస్ లో జరిగిన ఉగాది శ్రవణంలో ఆరణి శ్రీనివాసులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఆరణీ శ్రీనివాసులు కు తెలుగుదేశం బిజేపీ జనసేన పార్టీల నేతలతో పాటు ఆరణి శ్రీనివాసులు స్నేహితులు, అభిమానులు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది శ్రవణం తరువాత ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తెలుగు కొత్త సంవత్సరాదిలో నియోజకవర్గ ప్రజలందరికీ మంచి జరుగుతుందని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరం ప్రారంభంలో జరగనున్న ఎన్నికల్లో తెలుగుదేశం. బిజేపీ బలపరుస్తున్న జనసేన గెలవడం ఖాయమని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐదేళ్ల పాలనలో తిరుపతి అభివృద్ధిలో వెనుకబడి పోయిందని ఆయన చెప్పారు. ఐదేళ్లలో ఆధ్యాత్మిక నగరం కాస్త అసాంఘిక కార్యకలాపాలకి అడ్డాగా మారిందని ఆయన ఆరోపించారు. వచ్చే తెలుగు నూతన సంవత్సరంనాటికి తిరుపతిని ప్రశాంత నగరంగా మారుస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో తిరుపతి ఎమ్మెల్యేగా జనసేనను ఎంపిగా బిజెపిని గెలిపించాలని ఆరణి శ్రీనివాసులు కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంకు చెందిన కోడూరు బాలసుబ్రమణ్యం, ఆర్సీ మునికృష్ణా, చినబాబు, కూరపాటి సురేష్ కుమార్, బిజెపికి చెందిన అజయ్ కుమార్, జనసేన నాయకురాళ్ళు ఆకేపాటి సుభాసిని, కీర్తన, జనసేన తిరుపతి పట్టణ అధ్యక్షుడు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# తుమ్మలను దీవించిన భద్రాద్రి అర్చకులు

**దమ్మపేట, ఏప్రిల్ 9 ( నిఘా న్యూస్):** దమ్మపేట మండలం గుండుగులపల్లిలో మంత్రి తుమ్మల స్వగృహంలో ఉగాది పర్వదినం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. ఉగాది సందర్భంగా భద్రాచలం దేవాలయం నుంచి వచ్చిన అర్చకులు మంత్రి తుమ్మల కుటుంబ సభ్యులను వేద మంత్రోచ్ఛారణలతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల రాష్ట్ర ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు ప్రజలందరు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# భద్రాచలంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు




**భద్రాచలం, ఏప్రిల్ 9(నిఘా న్యూస్):** భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానంలో వసంత పక్ష ప్రయుక్త శ్రీరామ నవమి తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు మంగళవారం ఉగాది సందర్భంగా ఉదయం మేళతాళాలు, మంగళ వాయుద్యాలు, వేదమంత్రాల నడుమ గౌతమి నది నుండి తీర్థ జలం తీసుకుని వచ్చి శ్రీస్వామి వారికి ప్రత్యేక తిరుమంజనం నిర్వహించారు. ఉగాది ప్రసాదం వితరణ అనంతరం 9 గంటలకు ఉత్సవారంభం, రుత్విక్ వరణం, రక్షాభంధనం, స్నపన తిరుమంజనం నిర్వహించి, సాయంత్రం మృత్సంగ్రహణం, పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామి వారిని రాజ వీధిలో కల్పవృక్ష వాహనం పై తిరువీధి సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.



# రేవంత్ పాలనకు 100మార్కులు



- పిసిసి రేసులో ఉన్నాను
- కేసీఆర్ ఫ్రస్టేషన్ లో ఉన్నారు
- బిజెపి బౌండరీలో మందకృష్ణ
- నేను బస్టాండ్ లో ఎక్కాల్సిన బస్సు ఎక్కుతాను
- టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి

**సంగారెడ్డి, ఏప్రిల్ 9(నిఘా న్యూస్):** దేశం సుభిక్ష%శీ%గా ఉండాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని టి పీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఉగాది సంధర్బంగా కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉంటారని తెలిపారు. ఈ నూతన క్రోది నామ సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాపూజ్యం 16ఉందని 2 అవ మానం ఉందని అన్నారు. ప్రతి పక్ష్యాల అవ మానమే ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనకు ప్రజలు 100 వంద శాతం మార్కులు వేస్తున్నారని తెలిపారు. బిజెపి నాయకులు జిమ్మిక్కులు చేస్తూ అధికారంలోకి రావలని చూస్తున్నారని వారికి సాధ్యం కాదని తెలిపారు. తెలంగాణలో 14 ఎంపి సీట్లు గెలు స్తూన్నామని పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్ పార్టీ వైపే ఉందని పేర్కొన్నారు. మందకృష్ణ మాదిగ బిజెపి బౌ%శీ%డరిలో ఉన్నారని తెలిపారు. జగ్గారెడ్డి దేనికి కక్కుర్తి పడాడని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట మహిళలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ప్రజల ధనం ప్రజలకే ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. నేను పార్టీ పిరాయి%శీ%పుల గూర్చి మాట్లాడనని నేను పార్టీలు మారి వచ్చిన వ్యక్తినే అన్నారు. బిఆర్ఎస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ ఫ్రస్టేషన్ లో ఉన్నారని అందుకే కాంగ్రెస్ పై అర్థ రహిత మాటలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలన దేశానికి ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భాషలు వేరైనా మన ధర్మం ఒక్కటే

- 2027 కల్లా దేశం సూపర్ పవర్ గా ఎదగాలి
- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య, తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్
- స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది సంబరం




**రాజేంద్రనగర్, ఏప్రిల్ 9(నిఘా న్యూస్):** శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లో స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది సంబరం పేరుతో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా గవర్నర్ సీపీ రాధాకృష్ణన్,కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, రాష్ట్ర ప్రజలందరికీ క్రోధి నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడంలో వెంకయ్య నాయుడు ముందుంటారని ఆయన పేర్కొన్నారు. దేశాన్ని శక్తివంతం చేయడంలో వెంకయ్య నాయుడు ప్రముఖ పాత్ర పోషించారన్నారు. దేశం 5వ శాంతి వంతమైన ఆర్థిక శక్తిగా ఉందని, దేశం మరింతగా ముందుకు వెళ్తుందన్నారు. పంచాంగాన్ని మన పూర్వీకులు మనకు ఇచ్చారన్నారు. పంచాంగం ఆధారంగానే దేశంలో పండగలను, కార్యక్రమాలను జరుపు కుంటామని, వేరే భాషలు మాట్లాడుతున్నప్పటికి మనదంతా ఒకటే ధర్మమని తెలుగుకు ఉన్న ప్రాముఖ్యత చెప్పలేనిదన్నారు. మనది దృఢమైన సంస్కృతి, సంప్రదాయాలు కలిగిన దేశమని అన్నారు. గతంలో తమిళనాడులో పార్టీ ఎలా ముందుకు వెళ్లాల్లో వెంకయ్య సూచించారని పార్టీలు వెళ్తున్న తీరును వెంకయ్య నాయుడు గమనిస్తారన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఉగాది నాడు భారత్ ను సూపర్ పవర్ గా తయారు చేయాలనే సంకల్పాన్ని తీసుకుందామన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు.దేశం సూపర్ పవర్ గా ఎదుగుతుందన్నారు. సూపర్ పవర్ గా ఉన్న అమెరికా లాగా మనం ముందుకు వెళ్తున్నామన్నారు. వేషం,భాషా వేరైన మనమంతా భారతీయులం అని దేశాన్ని ముందుకు తీసుకెళ్లా మన్నారు. 2014లో ఆర్థికంగా పదవ స్థానంలో ఉన్న భారత్,నేడు ఐదో స్థానానికి చేరిందన్నారు. 2027 నాటికి మూడో ఆర్థిక వ్యవస్థగా దేశం చేరనుందన్నారు.అన్ని వ్యవస్థలను ప్రజలను అందుబాటులో ఉంచేలా ప్రధాని మోడీ చేశారన్నారు.

దేశాన్ని ముందుకు నడపడంలో ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. గతాన్ని గుర్తుకు పెట్టుకుని వర్తమానంలో ముందుకు నడవాలన్నారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కోపేరుతో ఉగాదిని పిలుచుకుని జరుపుకుంటారని ఆయన తెలిపారు. మతం, భాష వేరైనా మనమంతా భారతీయులమ న్నారు. కులం, మతం పేరుతో విడదీయరాదని ఉగాది వెనుక సంప్రదాయమే కాదు ఆరోగ్య కారణాలు కూడా ఉన్నాయన్నారు. క్రమ శిక్షణ, కష్టపడి పని చేయడం వల్లే ఈ స్థాయికి చేరుకునీ రెండో అత్యన్నత పదవికి చేరుకున్నాననీ అన్నారు. నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాలని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.



హైదరాబాద్ పార్లమెంటు బిజెపి అభ్యర్థి మాధవి లత ఆదివారం యాఖుత్పుర లోని సరస్వతి శిశుమందిర్ లో నిర్వహించిన ఉగాది వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె హిందూ సాంప్రదాయాలను సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందజేసేందుకు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా గోషామహల్ లోని భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పంచాంగం శ్రవణంలో పాల్గొన్నారు.

- చార్మినార్, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):

# వీధి బాలలను గుర్తించి నిధులు కేటాయించాలి

### పీపుల్స్ కలెక్టివ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్స్ ఫోరం




**హైదరాబాద్, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** వీధి బాలలను గుర్తించి, వారి అభివృద్ధి కోసం తగినన్ని నిధులు కేటాయించాలని పీపుల్స్ కలెక్టివ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్స్ ఫోరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వీధి బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని అందుకు సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫోరం ప్రతినిధులు అంబిక, శ్రీలత మాట్లాడుతూ ఈ నెల 12న ప్రపంచ వీధి బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెయిన్ బో ఫౌండేషన్ ఇండియా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో 1,099 మంది వీధి బాలలతో 14 హోమ్స్ కొనసాగుతున్నాయని, వాటిలో 7 రెయిన్ బో హోమ్స్(ఆడ పిల్లలు), మరో 7 స్నేహ ఘర్ పేరుతో మగ పిల్లల కోసం నడుస్తున్నాయన్నారు. వీటిలోని 110 మంది పిల్లలు డిగ్రీలు పూర్తి చేసి స్వతంత్ర జీవనాన్ని కొనసాగిస్తున్నారన్నారు. సమానత్వానికి కట్టుబడి ఉండటం, ప్రతి బిడ్డను రక్షించడం, కనీస సౌకర్యాలు కల్పించడం, పిల్లలకు ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా పరిష్కారాలు సృష్టించడం వంటి వాటిపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం ప్రతినిధులు, వీధి బాలలు అంజలి, తస్లీమా, శ్రావణి, అమర్ కుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# నాటు సారా కేంద్రాలపై దాడులు



**జీలుగుమిల్లి, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్):** ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండల మద్దపుగూడెం గ్రామం నాటు సారా కేంద్రాలపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 60 లీటర్ల నాటు సారాను 12 లీటర్ల బెల్లపు కొండ ధ్వంసం చేశారు. అలాగే ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు నాటు సారా విక్రయించే వారిపై చట్టమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# 810 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 9 (నిఘా న్యూస్): ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 810 బస్తాల పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న ఘటన కరీంనగర్ జిల్లాలో జరిగింది. వివరాల్లోకి వెళితే, కరీంనగర్ రూరల్ మండలంలోని గోపాల్ పూర్ గ్రామానికి చెందిన రేషన్ డీలర్ బెజ్జంకి అంజయ్య ప్రభుత్వం ద్వారా పంపిణీ చేసే పిడిఎస్ బియ్యాన్ని దుర్షెడ్ గ్రామంలోని వెంకటేశ్వర రైస్ మిల్ లో యజమాని మొగసాల సంతోష్ రెడ్డి కి ఎక్కువ ధరకు అమ్మడానికి ఊరడి మధు అనే వ్యక్తి ఆటోలో 810 బస్తాల పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని రేషన్ డీలర్ అంజయ్య, రైస్ మిల్ యజమాని సంతోష్ రెడ్డి, ఆటో డ్రైవర్ మధు లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## ప్రభుత్వ స్థలాలు మాయం..!!

# హెచ్చరిక బోర్డులు తొలగింపు

- ఆర్డీఓకు ఫిర్యాదు చేసినా ఫలి తం శూన్యం
- పాత్రికేయులకు మామూళ్లు



**గంగవరం, ఏప్రిల్ 10(నిఘా న్యూస్):** వైసిపి నాయకుల భూ దాహాని కి ప్రభుత్వ స్థలాలు కబ్జా అవు తున్నాయి. ఖాళీ స్థలాలు కనిపి స్తే కబ్జా చేసేస్తున్నారు. దీనివల న కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములు సుల భంగా ఆక్రమి స్తున్నారు. గంగవరం మండలం, మదనపల్లి రోడ్డు కు ఇరువైపులా ప్రభుత్వ స్థలాలు, భూములు ఉన్నాయి. ఇంత కాలం ఈ భూముల వైపు కన్నె త్తి కూడా చూడలేదు. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విలువైన భూములను కాజేస్తున్నారు. ఇటీవల భూములకు భారీగా ధర లు పెరిగాయి. దీంతో ఖాళీ కన పడితే కబ్జా చేస్తున్నారు. గంగ వరం పంచాయతీ పరిదిలోని ఫ్లై ఓవర్ ప్రక్కన సర్వే నెంబర్లు 383,401,319,320లో కోట్లాది రూపాయలు విలువచేసే రస్తా పోరంబోకు భూమి ఉంది. దీని ని కబ్జా చేయడానికి కొంతమం ది వైసిపి చోటా నాయకులు కుట్రపన్ని అప్పట్లో పనిచేసిన తహసీల్దార్ కు భారీగా ముదు పులు చెల్లించి నకిలీ పట్టాలు సృష్టించి కాజేసే ప్రయత్నం చేశారు. ఈ భూమిలో మట్టితోలి భర్తీ చేయడానికి ప్రయత్నించిన విషయం వెలుగులోకి రావడంతో స్థానిక టిడిపి నేతలు అడ్డు కున్నారు. ఈ విషయాన్ని స్థానిక ఆర్డీఓకు ఫిర్యాదుచేశారు. దీంతో రెవిన్యూ అధికారులు ఈ భూమిలో ఎవరూ ప్రవేశించరాదని హె చ్చరిక బోర్డులు పెట్టారు. వాటిని తొలిగించినప్పటికి రెవెన్యూ అ ధికారులు చర్యలు తీసుకోలే దు. అదే స్థలాల్లో రెండవసారి బుధవారం మట్టి తోలుతుండగా టిడిపి నాయకులు అడ్డుకున్నా రు. సంఘటనా స్థలంలో మట్టి తోలుతున్న రెండు ట్రాక్టర్లను రె వెన్యూ అధికారులు పోలీస్ స్టే షన్ కు తరలించారు. వాటిని సీ జ్ చేస్తున్నట్లు తెలిపారు. అయి తే కొంతమంది భూ కబ్జా కోరు లు ఫేక్ పట్టాలు సృష్టించి, మా కు పట్టాలు ఇచ్చారని, ఇన్జెక్షన్ ఆర్డర్ ఉందని పోలీసులతో తల పడ్డారు. హెచ్.పి.గ్యాస్ ఆఫీసు ఎదురుగా గల కొంత స్థలం, కీల పట్ల ఆర్చ్ ప్రక్కన ఖాళీ స్థలాన్ని కూడా ఆక్రమించుకున్నారు. అ యినా అధికారులు స్పందించిన పాపాన పోలేదు. టిడిపి ఆందోళ న చేసిన విషయం కూడా పత్రి కలు ప్రసంరించలేదు. ఎందుకంటే భారీ నజరానా అందినట్లు సమాచారం. సొసైటీకి నాలుగో పిల్లర్‌గా చెప్పుకునే కొంతమంది పాత్రికేయులు లక్షల్లో మాముళ్ళు తీసుకుని అక్ర మాలను ప్రోత్సహిస్తున్నారని ప లువురు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వభూములు ఆక్రమించు కున్న వారి పక్కన చేరారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆక్రమిత స్థలాలను స్వాధీ నం చేసుకుని, హెచ్చరిక బోర్డులు పెడుతామని గంగవరం హసిల్దార్ బుధ వారం పత్రికలకు మెసేజ్ ఇచ్చారు. అయినా ఇంత వరకు ఏర్పాటు చేయలేదు. కొంతమంది పత్రికా విలే కరులు తాయిలాల కోసమే ఈ రంగంలో పనిచేస్తున్నా రని విమర్శిస్తు న్నారు. గంగవరం బైపాస్ రోడ్డు ప్రక్కన కోట్లాది రూపాయలు విలువచేసే సుమారు మూడు ఎక రాలు ఆక్రమించుకుని,అధికారు కు ముడుపులు చెల్లించి, పట్టాదారు పాస్ బుక్కులు చేయించు కున్నారని, వాటిని కూడా త్వరలో బహిర్గతం చేస్తా మని టిడిపి నాయకులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకు న్నారని సర్వే నెంబర్ లతో సహా పలమనేరు రెవెన్యూ డివిజనల్ అధికారికి ఫిర్యాదు చేశారు. అయినా పట్టించుకోలేదనే విమర్శలు వస్తు న్నాయి. ఆక్రమిత స్థలాల్లో గంగవరం రెవెన్యూ అధికా రులకు భారీగా ముడుపులు చెల్లించారని తెలుస్తోంది. సంబం ధిత ఉన్నతాధికారులు స్పందించి కబ్జాదారుల నుండి స్థలాలను స్వాధీనం చేసుకోవాలని పలువురు కోరుచున్నారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com